PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 154 | విజయవాడ, బుధవారం 4 జనవరి 2023 | 6 + 8 పేజీలు వెల : రూ. 5. 50
Vol No | Vijayawada, Wednesday 4 January 2023 | Rs

నేటి నుండి 72 గంటల పాటు

విద్యుత్ కంపెనీల ఉద్యోగుల సమ్మె

- సిఐటియు మద్దతు

లోపలి పేజీలో..




తొలి టి20లో 2 పరుగుల తేడాతో

శ్రీలంకపై విజయం

- బ్యాటింగ్‌లో రాణించిన హుడా, ఇషాన్
- అరంగేట్రం మ్యాచ్‌లో అదరగొట్టిన శివమ్ మావి

లోపలి పేజీలో..



పింఛను చెక్కును అందిస్తున్న సిఎం జగన్

అర్హులందరికీ పింఛను

- మా ప్రభుత్వం పేదల పక్షపాతి
- 3వ విడత వైఎస్ఆర్ పెన్షన్ భరోసా పెంపులో సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను అందిస్తామని, అర్హులకు కోత విధించబోమని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వం పేదల పక్షపాతని, పేదలు, రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో మూడో విడత వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. తొలుత నగరంలోని మున్సిపల్ స్టేడియంకు హెలికాప్టర్‌లో వచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా ఆర్ట్స్ కళాశాల సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రజలు పూలు జల్లుతూ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆర్ట్స్ కళాశాలలో కలెక్టర్ కె.మాధవీలత అధ్యక్షత నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. తమ హయాంలో నేరుగా పింఛనును లబ్ధిదారుల ఇంటి వద్దే అందిస్తున్నామని తెలిపారు. లంచాలు లేని పరిపాలనతో వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చామని పేర్కొన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా పింఛను మొత్తాన్ని రూ.2,500 నుంచి రూ.2,750కి పెంచామని తెలిపారు. హెచ్ఐవి బాధితులతో పాటూ అందరికీ పెంచిన పింఛన్లు అందుతాయన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో 39 లక్షల మందికి పింఛన్లు ఇస్తే, తమ హయాంలో 64 లక్షల మందికి అందిస్తున్నామన్నారు. మూడున్నరేళ్లలో పెన్షన్ల కోసం రూ.62,500 కోట్లు కేటాయించామన్నారు.

చంద్రబాబు నైజం ఇదీ..

చంద్రబాబు తొలి నుంచీ శవ రాజకీయాలు చేశారని, ఇలాంటి ప్రతిపక్షనేత ఉండడం రాష్ట్రానికి పట్టిన ఖర్మ అని జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలోనే ఆయనకు ఎన్‌టిఆర్ గుర్తు వస్తారన్నారు. వెన్నుపోటు పొడవడం, ఫొటోషూట్, డ్రామాలు ఆడడం, మొసలి కన్నీరు కార్చడం మాత్రమే చంద్రబాబుకు తెలుసని దుయ్యబట్టారు. కందుకూరు సభలో జనం తక్కువ వస్తే ఎక్కువ మంది వచ్చారని చూపించేందుకు చిన్న రోడ్డులో ర్యాలీ నిర్వహించి ఎనిమిది మందిని బలిగొన్నారని విమర్శించారు. చంద్రబాబుకు ఎల్లో మీడియా, దత్తపుత్రుడి అండ ఉంటే, తనకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల అండ ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధమే వచ్చే ఎన్నికలన్నారు. ఈ యుద్ధంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా పేదవాడు నాశనమైపోతాడనే విషయాన్ని మర్చిపోరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, దాడిశెట్టి రాజా, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపిలు భరత్‌రామ్, సుభాష్ చంద్రబోస్, వంగా గీత, చింతా అనురాధ, పలువురు ఎంఎల్‌ఎలు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపై సభలు, ర్యాలీలు

'నిషేధం' జిఓపై నిరసనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రోడ్లపై సభలను, ర్యాలీలను ప్రభుత్వం నిషేధించింది. జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రాజ్ రోడ్లనపైన, వాటి మార్జిన్లలో ఇక నుండి ఎటువంటి సభలకు, ప్రదర్శనలకు అనుమతి చ్చేది లేదంటూ ఉత్తర్వులు (జిఒనెం1) జారీ చేసింది.

కందుకూరు, గుంటూరుల్లో చోటుచేసుకున్న విషాద సంఘటనలను సాకుగా చూపుతూ సోమవారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వులు కలకలం రేపాయి. ప్రభుత్వ నిర్ణయం ప్రజల హక్కులపై దాడి చేయడమేనన్న అభిప్రాయం రాష్ట్ర వ్యాప్తంగా వ్యక్తమవుతోంది. వైసిపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు ప్రభుత్వ ఉత్తర్వులను తీవ్రంగా ఖండించాయి. ప్రజల భావప్రకటన స్వేచ్ఛపై ప్రభుత్వం చేసిన దాడిగా పలువురు న్యాయవాదులు అభివర్ణించారు. బ్రిటిష్ కాలంనాటి (1861సం) పోలీస్ చట్టం ప్రకారం జారీ చేసిన ఈ ఉత్తర్వులతో మంగళవారం ఉదయం నుండే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పోలీస్ యాక్ట్‌లోని సెక్షన్ 30 అమలులోకి వచ్చింది. దీని ప్రకారం ఏ చిన్న కార్యక్రమానికైనా పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలి. అయితే, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు వేగవంతంగా సరుకు రవాణాకు, ప్రయాణాలకు ఉద్దేశించినవని, మున్సిపల్, పంచాయతీరోడ్లు ఇరుకుగా, స్థానిక ప్రజల రవాణా అవసరాలు తీర్చడానికి ఉద్దేశించినవని, వీటిపై అనుమతి ఇవ్వకూడదని అధికారులను ఈ ఉత్తర్వులలో ప్రభుత్వం ఆదేశించింది. ఈ తరహా కార్యక్రమాలకు ప్రత్యామ్నాయ స్థలాలు చూడాలని సూచించింది. అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే షరతులతో అనుమతిచ్చే అధికారాన్ని జిల్లా ఎస్‌పిలకు, పోలీస్ కమిషనర్లకు కట్టబెట్టింది.



జిఓ నెంబరు 1 కాపీలను దగ్ధం చేస్తున్న వి.శ్రీనివాసరావు, కె రామకృష్ణ, చలసాని శ్రీనివాసరావు విద్యార్థి యువజన సంఘాల నాయకులు

ఉపసంహరించుకోవాలి : సిపిఎం

రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే జిఓ తీసుకొచ్చిందని పేర్కొన్నారు. 'పోలీసులకు సర్వాధికారాలు కట్టబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం. పోరాడి సాధించుకున్న పౌరహక్కులను ఏ పేరుతో అణచివేసినా సిపిఎం వ్యతిరేకిస్తుంది. కందుకూరు, గుంటూరు ఘటనలను ఆసరా చేసుకొని రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రోడ్లలో సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిషేధించడం అప్రజాస్వామికం. రోడ్లపైన ర్యాలీలు, సభలు జరిపితే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయనుకుంటే గుంటూరులో గ్రౌండ్‌లో సభ జరిపినప్పటికీ దుర్ఘటన జరగడం, పోలీసు వైఫల్యం స్పష్టంగా కనపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజాస్వామ్య, పౌరహక్కులను కాలరాయడానికి ఇటువంటి జిఓ తీసుకురావడం సరైంది కాదు.' అని పేర్కొన్నారు. 'ఇప్పటికే కార్మికులు, రైతులు, ప్రజలు తమ కోర్కెలు, హక్కులకోసం ఆందోళనలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అణచివేస్తోంది ముందస్తు అరెస్టులు చేస్తోంది. సభలకు, ర్యాలీలకు అనుమతినివ్వడం లేదు. ఉన్న గ్రౌండ్లను ప్రభుత్వం ఆక్రమించుకొని పట్టణాలలో ఖాళీ స్థలమన్నది లేకుండా చేస్తోంది. ఊరికి దూరంగా ప్రజలతో సంబంధం లేకుండా సభలు జరుపుకోవాలనడం ఆమోదయోగ్యం కాదు. ప్రధాన పట్టణాల్లో సభలు జరుపుకోడానికి అవసరమైన మైదానాలను కేటాయించాలి. ప్రదర్శనలకు అనుమతినివ్వాలి.' అని డిమాండ్ చేశారు. 'జిఓ అమలు చేయడమంటే ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజాతంత్రవాదుల నోరు నొక్కే ప్రయత్నమే. నిరసన తెలియజేసే హక్కును కూడా ప్రభుత్వం నిషేధిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించే జిఓను ఉపసంహరించుకోవాలి. ప్రజాతంత్రవాదులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు, న్యాయకోవిదులు దీన్ని వ్యతిరేకిస్తూ ముందుకు రావాలి' అని వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు పర్యటనపై ఆంక్షలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం నుంచి మూడు రోజులపాటు కుప్పంలో పర్యటించనున్నట్లు ఇది వరకే షెడ్యూల్ ఖరారైంది. ర్యాలీలు, సభలపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో చంద్రబాబు పర్యటనపై ఆంక్షలు విధించడం గమనార్హం. ఈ మేరకు చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శికి పలమనేరు డిఎస్‌పి నోటీసులిచ్చారు. సభలు ఎక్కడ పెడుతున్నారో ముందస్తు సమాచారం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. రోడ్లపై సభలు, ర్యాలీలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు.

వైసిపికి కూడా వర్తిస్తుంది : సజ్జల

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓ అన్ని రాజకీయ పార్టీలతో పాటు వైసిపి కూడా వర్తిస్తుందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఏ రాజకీయ పార్టీయైనా దీనిని అమలు చేయాల్సిందేనని చెప్పారు. కందుకూరు, గుంటూరు సభల్లో చోటుచేసుకున్న దుర్ఘటనలను దృష్టిలో వుంచుకొని ప్రజల భద్రత కోసం ఈ జిఓ జారీ చేసినట్లు తెలిపారు.

20 నుండి హోదా కోసం బస్సు యాత్ర

- విద్యార్థి, యువజన సంఘాల ప్రకటన
- పార్టీలు, ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనే లక్ష్యంగా ఈ నెల20వ తేది నుండి బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు విద్యార్థి, యువజన సంఘాలు ప్రకటించాయి. హిందూపురంలో ఈ యాత్ర ప్రారంభమై, ఫిబ్రవరి 4న ఇచ్ఛాపురంలో ముగియనుంది. విద్యార్థి యువజన సంఘాలు తలపెట్టిన ఈ బస్సు యాత్రకు పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. విజయవాడలోని దాసరి భవన్‌లో మంగళవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు ప్రధాన రాజకీయపార్టీలు ప్రత్యేకహోదాయే ప్రధాన అంశంగా ముందుకు తెచ్చాయన్నారు. నాలుగేళ్లుగా ఈ విషయంపై పాలకపక్షాలు మాట్లాడటం మానుకున్నారని విమర్శించారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రధాన మంత్రితో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. 32మంది బలిదానాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేస్తున్నా ముఖ్యమంత్రి ప్రధానిని కలిసిన సమయంలో కనీసం ప్రస్తావన చేయడం లేదన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చుతారా? లేదా? అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి, యువజన సంఘాలు ముందుకు వచ్చి ఉద్యమం చేపట్టడం అభినందనీయమన్నారు.. విద్యార్థులు, యువత రోడ్లపైకి వస్తే తప్ప పాలకులు దిగిరారన్నారు. మచిలీపట్నం మాజీ పార్లమెంటు సభ్యులు, టిడిపి నేత కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర విభజనలో జరిగిన అన్యాయానికి తాను ప్రత్యక్ష సాక్షినని చెప్పారు. సిబిఐ కేసుల భయంతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి , 22మంది వైసిపి ఎంపిలు నోరెత్తడం లేదన్నారు. ప్రత్యేక హోదా సాధనా సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిందన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో నవతరం పార్టీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, దోనేపూడి శంకర్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, పిడిఎస్‌యు జాతీయ నాయకులు రవిచంద్ర, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి వేముల శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్రఅధ్యక్షులు పరుచూరి రాజేంద్ర, సిపిఐ ఎంఎల్ నాయకులు ఎం.రామకృష్ణ, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు, ఎపి ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రానాయక్, కోశాధికారి ఆర్ పిచ్చయ్య పాల్గొన్నారు. రౌండ్‌టేబుల్ అనంతరం రోడ్లపై ప్రదర్శనలు, సభలు, సమావేశాలను నిషేదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జిఓ కాపీని దగ్ధం చేశారు.





ప్రజా ప్రతినిధుల భావ ప్రకటన స్వేచ్ఛపై

అదనపు ఆంక్షలు విధించలేం

- సుప్రీం మెజార్టీ తీర్పు
- పార్లమెంటే పరిష్కారం చూపాలి : మైనార్టీ అభిప్రాయం

లోపలి పేజీలో..

పిటి ఉషకు జగ్మతీ సంగ్వాన్ లేఖ

అదానీకి అనుచిత లబ్ధి

- మధురవాడలో భూకేటాయింపులు ఆపాలి
- హైడ్రో ప్రాజెక్టులు గిరిజన చట్ట ఉల్లంఘనే
- న్యాయ కమీషన్ విచారణ కోరుతూ ముఖ్యమంత్రికి ఇఎఎస్ శర్మ లేఖ



ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని మధురవాడ సర్వే నెంబరు 409లో 130 ఎకరాల విస్తీర్ణంలో అదానీ గ్రూపు ఏర్పాటు చేయనున్న డేటా ఎనలటిక్స్ సెంటర్ (డిఎసి)కు అనుమతులిస్తూ భూమి కేటాయించడం సరైంది కాదంటూ విశాఖకు చెందిన మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ ప్రాంతంలో భూముల ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో కారుచౌకగా కట్టబెట్టడం అభ్యంతరకమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో హైడ్రో ప్రాజెక్టులపైనా, గంగవరం పోర్టులో వ్యూహాత్మక ఈక్విటీ వాటా అమ్మేయంపైనా ఈ లేఖలో ప్రస్తావించారు. ఆ లేఖ సారాంశం ఇలా ఉంది.

130 ఎకరాల మార్కెట్ విలువ రూ.4 వేల కోట్లు

అదానీ గ్రూపునకు ప్రభుత్వం ఇచ్చిన 130 ఎకరాల భూమి విలువ రూ.4000 కోట్లు దాటుతుంది. రాష్ట్ర ప్రభుత్వం 2012 సెప్టెంబర్ 14 నాటి జిఒ ఎంఎస్ నెంబర్ సంఖ్య 571 ద్వారా నోటిఫై చేసిన భూవినియోగ విధానం ప్రకారం చూస్తే ప్రజాప్రయోజనాల కోసం ప్రయివేట్ ఏజెన్సీలు, సంస్థలకు లీజుకు ఇచ్చిన భూమికి సంవత్సరానికి లీజు అద్దె దాని మార్కెట్ విలువలో పది శాతం కంటే తక్కువగా ఉండకూడదు. దీని ప్రకారం మధురవాడలో భూమి లీజుకు అద్దె సంవత్సరానికి రూ.400 కోట్లు కంటే తక్కువకు ఇవ్వకూడదు. కానీ, ప్రభుత్వం రూ.130 కోట్లకు కేటాయించడం దారుణం. భూమితో సహా సహజ వనరులను ప్రయివేట్ వ్యక్తులకు కేటాయించే విషయంలో పారదర్శకత అవసరమని సుప్రీం కోర్టు పదేపదే గతంలో నొక్కి చెప్పింది. అలాంటి పారదర్శకత లేకపోవడం దారుణం.


ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలను ఉల్లంఘిస్తూ...

రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో మొత్తం 5000 నుంచి 6000 మెగావాట్ల కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న నాలుగు నుంచి ఐదు పంప్డ్ మిగతా 5లో

ప్రభుత్వరంగ సంస్థల అమ్మకానికి

చెల్లుచీటీ

- బ్రెజిల్ అధ్యక్షుడు లూలా తొలి నిర్ణయం



బ్రసీలియా : అధికారం చేపట్టగానే బ్రెజిల్ కొత్త అధ్యక్షుడు లూలా డసిల్వా ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ చర్యలకు స్వస్తి పలికారు. నూతన సంవత్సరం రోజున లూలా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీల దుశ్చర్యలను సహించేది లేదని ఆయన తన చేతల ద్వారా స్పష్టంచేశారు. పెట్రో బ్రాస్‌గా అందరికీ చిరపరిచితమైన బ్రెజిల్ చమురు కంపెనీ పెట్రోలియో బ్రసీలెరోతోపాటు ప్రభుత్వ రంగంలోని ఎనిమిది కార్పొరేట్ సంస్థలను విక్రయించే ప్రణాళికలను రద్దు చేశారని బ్రెజిల్ వార్తా వెబ్‌సైట్ జి1 వెల్లడించింది. ప్రభుత్వ ఆస్తుల అమ్మకాల జాబితా నుంచి ప్రభుత్వ కార్పొరేషన్లను తొలగించడం లూలా తీసుకున్న మొట్టమొదటి అధికార నిర్ణయాల్లో ఒకటి. ఈ జాబితాలో పెట్రో బ్రాస్‌తోపాటు చమురు, గ్యాస్ ఉత్పత్తి ఒప్పందాల్లో ప్రభుత్వ వాటాలను పర్యవేక్షించే, విక్రయించే బాధ్యతలను చూసే సంస్థ ప్రీ సాల్ పెట్రోలియో వుంది. పోస్టల్ సేవల సంస్థ, ప్రభుత్వ బ్రాడ్‌కాస్ట్ నెట్‌వర్క్ వ్యవహారాలు చూసే సంస్థ కూడా వున్నాయి. సామాజిక సంక్షేమ వ్యవస్థ ఐటి సేవలు చూసే సంస్థ, వ్యవసాయ మంత్రిత్వ శాఖకి చెందిన నేషనల్ సప్లై కంపెనీలను కూడా ప్రైవేటీకరణ జాబితా నుంచి తొలగించారు. ప్రభుత్వ సేవలపై లేదా మార్కెట్‌పై ప్రైవేటీకరణ ప్రభావాన్ని పూర్తిస్థాయిలో విశ్లేషిస్తామని లూలా హామీ ఇచ్చారు. నూతన ఆర్థిక చట్రంలో పెట్రోబ్రాస్ వంటి ప్రధాన చమురు కంపెనీలు, బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. లూలా ప్రభుత్వ నిర్ణయంతో సోమవారం శావో పోలో స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ 3.24శాతం క్షీణించింది. పెట్రోబ్రాస్ షేర్లు దాదాపు ఆరు శాతం పడిపోయాయి. ప్రజలకు మరింత సమర్థవంతంగా, ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా తీసుకున్న ఈ చర్యలపై ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

రైతుకు బరువైన ఎరువు

- ధరలు భరించలేక తగ్గిస్తున్న వినియోగం
- కాంప్లెక్స్, పొటాష్‌లకు దూరం
- యూరియా, డిఎపి వైపు మొగ్గు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

నానాటికీ పెరుగుతున్న ఎరువుల ధరలను భరించలేక రైతులు అనివార్యంగా ఎరువుల వినియోగాన్ని అంతకంతకూ తగ్గించుకుంటున్న ధోరణి రాష్ట్రంలో క్రమేపి స్థిరపడుతోంది. ఇదే సమయంల కాస్త తక్కువ రేట్లపై లభించే యూరియా, డిఎపి వంటి ఎరువుల వైపు రైతాంగం మొగ్గు చూపుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దాదాపు మూడేళ్లుగా ఒక వైపు కోవిడ్ విలయం సాగుదారులను అతలాకుతలం చేయగా, ఇదే సమయంలో కేంద్రం ఎరువుల సబ్సిడీలకు కోతలు పెట్టింది. అంతర్జాతీయంగా ముడి సరుకుల ధరలు పెరుగుతున్నాయంటూ రాయితీలను తగ్గించడంతో పాటు డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) విధానాన్ని మరింత పకడ్బందీగా అమలు చేస్తోంది. పోషకాధారిత సబ్సిడీ (ఎన్‌బిఎస్) పాలసీతో యూరియా మినహా తతిమ్మా ఎరువుల ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఎరువుల కంపెనీలు ఇష్టానుసారం కాంప్లెక్స్, పొటాష్ ఎరువుల ధరలను పెంచుకుంటూ పోతున్నాయి. ఎరువుల ధరలు కంపెనీ కంపెనీకీ, రోజుకో తీరుగా మారిపోతున్నాయి.



తక్కువ ధర ఫెర్టిలైజర్ వైపు

కేంద్రం ఎన్‌బిఎస్ పాలసీలో నైట్రోజన్ (ఎన్)కు మాత్రమే సబ్సిడీ ఇచ్చి ధరలను నిర్ణయిస్తోంది. ఫాస్పరస్ (పి), పొటాష్ (కె) ఎరువులకు ఎప్పటికప్పుడు పోషక ఆధారంగా నిష్పత్తి ప్రాతిపదికన కిలోల వంతున సబ్సిడీ నిర్ణయిస్తోంది. పెరిగిన ముడి సరుకులకు తగ్గట్టు సబ్సిడీ నిర్ణయించకుండా ఎంతో కొంత నిర్ణయించి చేతులు దులుపుకుంటోంది. దాంతో కాంప్లెక్స్, పొటాష్ ఎరువుల ధరలు ఈ కాలంలో విపరీతంగా పెరిగాయి. గత ఖరీఫ్‌కు ఈ ఏడాది ఖరీఫ్‌కు పెరుగుదల ఎరువులను బట్టి 30 శాతం నుంచి 94 శాతం వరకు ఉంది. ఎంఒపి బస్తా రూ.875 నుంచి 1,700 అయింది. 20-20-0 రేటు రూ.975 నుంచి 1,470 అయింది. 28-28-0 ధర రూ.1,275 నుంచి 1,700 అయింది. 14-35-14 రేటు రూ.1,275 ఉన్నది కాస్తా 1,700 అయింది. ఫలితంగా ఈ ఎరువుల వినియోగాన్ని రైతులు తగ్గించుకున్నట్లు విక్రయాల గణాంకాలు తెలుపుతున్నాయి. ఎపిలో కాంప్లెక్స్ ఎరువుల సేల్స్ ముందటేడు 7 లక్షల టన్నులు కాగా నిరుడు 5.74 లక్షల టన్నులు. ఈ ఖరీఫ్‌లో 5.48 లక్షల టన్నులకు ఇంకా తగ్గాయి. ఎంఒపి సేల్స్ ముందటేడు 1.25 లక్షల టన్నులు, నిరుడు 1.01 లక్షల మిగతా 5లో

ఖరీఫ్ ఎరువుల సేల్స్ (లక్షల టన్నులు)

ఎరువు	2020	2021	2022
యూరియా	7.26	5.95	6.06
డిఎపి	2.25	1.87	2.61
కాంప్లెక్స్	7.00	5.74	5.48
ఎంఒపి	1.25	1.01	0.50
ఎస్ఎస్‌పి	0.95	0.98	0.86

31 నుంచి బడ్జెట్ సమావేశాలు

- తొలిరోజే పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే
- ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం నూతన పార్లమెంట్ భవనంలో తొలి రోజు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభోపన్యాసం చేస్తారు. ఆమె రాష్ట్రపతిగా ఎన్నికైన తరువాత మొదటిసారిగా పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచనున్నారు. ఆ తరువాత పార్లమెంట్‌లో ఆర్థిక సర్వేను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఫిబ్రవరి 1న వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. ఈ బడ్జెట్ సమావేశాలు రెండు విడతలుగా జరగనున్నాయి. తొలి విడతలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 10 వరకు, రెండో విడతలో మార్చి 6 నుంచి ఏప్రిల్ 6 వరకు నిర్వహిస్తారు. తొలి విడతలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, వార్షిక బడ్జెట్‌పై చర్చ జరుపుతారు. రెండో విడతలో పలు బిల్లులకు ఆమోదించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ చేయనుంది.

ఏకాదశి ఆదాయం 7.68 కోట్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం గణనీయంగా పెరిగింది. సోమవారం ఒక్కరోజే రూ.7.68 కోట్లు వచ్చినట్లు టిటిడి అధికారులు తెలిపారు. 69,414 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఇప్పటివరకు ఉన్న రికార్డుల ప్రకారం 2018 జులై 27న రూ. 6.28 కోట్ల హుండీ ఆదాయం రాగా, గత ఏడాది అక్టోబర్ 23న రూ.6.31 కోట్లు వచ్చింది.ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి రోజున రూ.7.68 కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఎపిపిఎస్‌సి వార్షిక నివేదిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగ ప్రకటనల కోసం యువత వేచి ఉన్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా కమిషన్ ఉద్యోగ నియామక ప్రక్రియలు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. మంగళవారం రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2021-22 వార్షిక నివేదికను గవర్నర్ ఆవిష్కరించారు.. ఎపిపిఎస్‌సి కమిషన్ ఛైర్మన్ గౌతంసవాంగ్ మాట్లాడుతూ న్యాయపరమైన వివాదాల ఫలితంగా సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అతి త్వరలో మరికొన్ని ఉద్యోగ ప్రకటనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

23న క్యూబా సంఘీభావ సదస్సు

- చే గువేరా కుమార్తె అలైదా, మనవరాలు ఎస్టేఫిన్ రాక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రం ఈ నెల 23న క్యూబా సంఘీభావ సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ ఉద్యమ స్ఫూర్తి ప్రధాత, లాటిన్ అమెరికా విప్లవయోదుడు ఎర్నెస్టో చే గువేరా కుమార్తె, ప్రముఖ వైద్యులు డాక్టర్ అలైదా గువేరా, ఆయన మనవరాలు ప్రముఖ అర్థికవేత్త ఎస్టేఫిన్ గువేరా హాజరు కానున్నారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరతూ మంగళవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో సన్నాహక సమావేశం జరిగింది. 23న జరిగే సదస్సు జయప్రదం కోసం ప్రముఖ న్యాయవాది, పౌర హక్కుల నాయకులు సుంకర రాజేంద్రప్రసాద్, అంతర్జాతీయ పరిణామాల విశ్లేషకులు బుడ్డిగ జమీందారి కన్వీనర్లుగా 50 మందితో ఆహ్వానసంఘం ఏర్పాటైంది.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, పౌర హక్కుల సంఘాల ప్రతినిధులు, మేధావులు, నగర ప్రముఖులు మాట్లాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్యూబా విముక్తి కోసం ఫైడల్ కాస్ట్రో, చే గువేరా ఉద్యమించిన స్ఫూర్తితో మొత్తం లాటిన్ అమెరికాలోనే వామపక్ష ఉద్యమం బలపడిందన్నారు. క్యూబా ప్రధాన ఆదాయవనరుగా ఉన్న పర్యాటక రంగం, చక్కెర ఎగుమతులపై అమెరికా సామ్రాజ్యవాదం అష్టదిగ్బంధం చేసినా ఏమాత్రం వెరవక ప్రజలకు విద్య, వైద్యాన్ని అందించడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కోవిడ్ సమయం లోనూ అనేక దేశాలకు క్యూబా వైద్య సేవలం దించిందని గుర్తు చేశారు. అలాంటి క్యూబా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి వామపక్షాలతో పాటు ఇతర పార్టీలు కూడా సంఘీభావం తెలపాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ క్యూబా సాధించిన విజయాలను, చరిత్రను, విప్లవస్ఫూర్తిని నేటితరం యువతకు అందించాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పరిమి, మాజీ ఎంపీ పి మధు, సిపిఐ నాయకులు అక్కినేని వనజ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి నాయకులు పొలారి, నగర ప్రముఖులు కొల్లా రాజ్‌మోహన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జల్లి విల్సన్, వై వెంకటేశ్వరరావు

సావిత్రిబాయి స్ఫూర్తితో సామాజిక న్యాయం

- డిఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సావిత్రిబాయి బాటలో సామాజిక న్యాయ ఉద్యమాన్ని ముందుకు కొనసాగించాలని, పూలే జీవితమే మహా సందేశమని డిఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. విజయవాడ సున్నపు బట్టీలు సెంటర్‌లోని పూలే అంబేద్కర్ భవన్‌లో సావిత్రి బాయి పూలే 192వ జయంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. సావిత్రి బాయి, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్రమాల్యాద్రి అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ అణగారిన ప్రజలపై కొనసాగిన నీచపు సంస్కృతికి ధిక్కారస్వరమే సావిత్రిబాయి అనేలా వారికి విద్య నేర్పారని కొనియాడారు. స్నేహితురాలు ఫాతిమా షేక్ సహాయంతో 53 పాఠశాలలు నడిపారన్నారు. సావిత్రిబాయిపూలే, మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్, పెరియార్ రామస్వామి, సుందరయ్య లాంటి మహనీయుల స్ఫూర్తితో పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ రాష్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న , అశోక్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి క్రాంతికుమార్ , కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నటరాజ్, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, అరుణ, డ్వైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, గంగాధర్ సహాయం, డానియేలు , చిన్నారి పాల్గొన్నారు.

జిఓ నెంబర్ 1పై సర్వత్రా ఆగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారత రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను హరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. జిఒ నెంబరు1పై న్యాయ నిపుణులు, రాజకీయ, ప్రజాసంఘాల నాయకుల స్పందన వారి మాటల్లోనే..

ఇదేమి ప్రజాస్వామ్యం?

సుంకర రాజేంద్రప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యులు



బ్రిటీషు పాలనలో ప్రజలను తమ అభిప్రాయాన్ని చెప్పడానికి వీల్లేకుండా తీవ్ర ఆంక్షలు ఉండేవి. జిఓ నెంబరు 1ని చూస్తుంటే అదే అనిపిస్తోంది. ఎవరూ మాట్లాడటానికి వీల్లేదు. ప్రజల వద్దకెళ్లి తమ భావాన్ని వ్యక్తపరుచుకునే స్వేచ్ఛలేదు. రోడ్డుమీద, మార్జిన్ మీద సభలు, సమావేశాలు నిర్వహించుకోకూడదనడం భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమే తప్ప మరొకటి కాదు. భావప్రకటనా స్వేచ్ఛను నిషేధించే అధికారం ఏ రాష్ట్ర ప్రభుత్వానికీ లేదు. ప్రభుత్వం ఏకపక్షంగా ఇచ్చిన జిఓను వెనక్కు తీసుకోవాలి.

బ్రిటీష్ పాలనా విధానాలు

చలసాని అజయ్, బార్ కౌన్సిల్ సభ్యులు



జిఓ నెంబరు ఒకటిని చదివితే అచ్చు బ్రిటీష్ పాలనా విధానాన్ని గుర్తు చేస్తోంది. స్వాతంత్ర్య పోరాటంలో ఎవరు మాట్లాడినా వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టే విధంగా తీసుకొచ్చిన పోలీసు చట్టాన్ని నేడు అమలు చేస్తున్నారు. ఒకవేళ సభలు సమావేశాలు పెట్టరాదంటే గతంలో ఎల్‌కె అద్వానీ, ఇప్పుడు రాహుల్, రాష్ట్రంలో జగన్, చంద్రబాబు వీరంతా పాదయాత్రలు, బస్సు యాత్రలు చేసేవారా?

ఇది పరిష్కారం కాదు

పి శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది

ఎక్కడో ఏదో జరిగిందని ప్రతిదానినీ నిషేధించడం దేనికీ పరిష్కారం కాదు. పైగా రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. భావ ప్రకటనా స్వేచ్ఛను పోలీసు వ్యవస్థ కాలరాయాలను కుంటోంది. ఇంతకంటే దుర్మార్గం లేదు. సమస్య వచ్చినప్పుడు సంబంధిత భాగస్వాములతో చర్చల ద్వారా పరిష్కారం చూడాలి. అంతేకాని నిషేధించడం పరిష్కారం కాబోదు.

ప్రజాస్వామ్య ప్రక్రియకు అడ్డు చెప్పడమే

నర్రా శ్రీనివాసరావు, ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా నియంత్రించాలనుకోవడం తప్పు. సభలు, సమావేశాలు బహిరంగ ప్రదేశాలు, రోడ్ల వంటి వాటిపై ఇబ్బంది లేకుండా జరుపుకోవడంలో అభ్యంతరం ఏమీ ఉండదు. దాన్ని నియంత్రిస్తామని పోలీసులు ఆదేశాలు ఇవ్వడం రాజ్యాంగానికి విరుద్ధం. ఇప్పటికే 144, 30 సెక్షన్లు నిరంతరం అమలు చేస్తున్నారు. ఇటీవల జగన్మోహన్‌రెడ్డి రోడ్లపైనే వ్యాన్లు, ఆటోలు ప్రారంభించారు. ట్రాక్టర్ల పంపిణీ చేపట్టారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. అప్పుడు ప్రజలను పట్టించుకోకపోవడం, ఇప్పుడు మరొకరు చేశారని నిషేధించడం రాజ్యాంగ స్ఫూర్తి కాదు.

ఏకపక్ష నిర్ణయాలు సరికాదు


బాల, హైకోర్టు న్యాయవాది



ప్రజా రవాణాకు అభ్యంతరం లేకుండా సభలు సమావేశాలు పెట్టుకోవచ్చని జిఓలో పేర్కొన్నారు. సభలు జరపడానికి వీల్లేదని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది లేని విధంగా చేస్తే అభ్యంతరం లేదు. కానీ ఆ పేరిట ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య ఉల్లంఘన అవుతుంది.

అధికార పార్టీ కోసమే..

ముప్పాళ్ల సుబ్బారావు, హైకోర్టు సీనియర్ న్యాయవాది



ఈ జిఓ అధికార పార్టీకి ఉపయోగపడే విధంగా, ప్రతిపక్షాలను నియంత్రించే విధంగా రూపొందించింది తప్ప మరొకటి కాదు. భావ వ్యక్తీకరణ, ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన బాధ్యత పాలకులది. కానీ స్వేచ్ఛను నియంత్రించే విధంగా పాలకులు ఆదేశాలు తీసుకురావడం ప్రజాస్వామ్యం కాదు.

జిఓ 1 చెల్లదు

పొత్తూరి సురేష్ కుమార్, పౌర హక్కుల సంఘం



సభ పెట్టుకోవద్దు అంటే పౌరహక్కులను, రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కును ప్రభుత్వం ఆపేసినట్లే. ప్రత్యేక సమయాల్లో మినహాయింపులు ఇవ్వొచ్చు అని జిఓలో పేర్కొన్నారు. అంటే వాళ్లకు ఇష్టం వచ్చిన వారికే అనుమతి ఇస్తారు. లేనివారికి ఇవ్వరు. రాష్ట్ర, జాతీయ రహదారులు మీద అనుమతి లేదని చెబుతున్నా జిఓలో మాత్రం పంచాయతీ, జిల్లా పరిషత్ రోడ్లపైనా జరపడానికి వీల్లేదని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ ఉల్లంఘనే.

నిరంకుశం : సిపిఐ



జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నిరంకుశ విధానం. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణాలు మానుకుంటారా?. ప్రజా ఉద్యమాలను, ప్రశ్నించే గొంతుకలను ప్రతిపక్షాలను అణచివేసే కుట్రలో భాగమే 1861 పోలీసు యాక్టు ఉత్తర్వులు. వైసిపి శ్రేణులకు మాత్రమే ప్రత్యేక పరిస్థితులు వర్తిస్తాయా ?

జగన్‌కు భయం పట్టుకుంది

టిడిపి నేతలు నిమ్మల, గోరంట్ల



సభలు, రోడ్ షోలను నిషేధించడం అంటే జగన్‌కు భయం పట్టుకుంది. అందుకనే నిషేధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆంక్షలు విధించిన జగన్ మంగళవారం నాడే రాజమండ్రిలో రోడ్‌షో నిర్వహించడం ఉల్లంఘన కాదా? అధికారపక్షానికే వెసులుబాటు కల్పించేలా జిఓ ఉంది. ప్రజా గొంతుకను అణచివేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని రోడ్‌షోల్లోనే ప్రశ్నిస్తాము.

బ్రిటీష్ కాలం నాటి చట్టం ద్వారా ఆంక్షలా ?

జనసేన నేత నాదెండ్ల మనోహర్



బ్రిటీష్ కాలం నాటి చట్టాల ద్వారా ఆంక్షలు విధించడం సరికాదు. విశాఖలో పవన్ కల్యాణ్ పర్యటనను అడ్డుకున్నారు. ప్రతిపక్షాలను ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పుడు ఏకంగా జిఓ తీసుకొచ్చారు. దీనివల్ల ప్రభుత్వానికి తప్ప ప్రజాస్వామ్యానికి ఏ మాత్రమూ ఉపయోగం లేదు.

గొడ్డలి పెట్టు : కాంగ్రెస్

జిఓ నెంబరు 1 ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. సభలు, సమావేశాలు రోడ్లపై కాకుండా ఎక్కడ నిర్వహించుకుంటారో ప్రభుత్వమే చెప్పాలి. గత ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు రోడ్లపై కాకుండా ఎక్కడ చేశారు ? ఇటువంటి నియంతృత్వ విధానాలు మానుకోవాలి.



అనంతపురం క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఆంక్షలు అప్రజాస్వామికం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రోడ్లపై సభలు, ర్యాలీల నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అనంతపురం క్లాక్‌టవర్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మంగళ వారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కందుకూరు, గుంటూరు ఘటనలను ఆసరా చేసుకుని రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రోడ్‌లలో సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిషేధించడం అప్రజాస్వామికమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే జిఒను తీసుకొచ్చిందని విమర్శించారు. పోలీసులకు సర్వాధికారాలు కట్టబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న పౌరహక్కులను ఏ పేరుతో అణచివేసినా సిపిఎం వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఇప్పటికే కార్మికులు, రైతులు, ప్రజలు తమ కోర్కెలు, హక్కుల కోసం ఆందోళనలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసు యంత్రాంగంతో అణచివేస్తోందన్నారు. ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేస్తోందని తెలిపారు. ఇది చాలదన్నట్లు ఏకంగా జిఒను తీసుకు రావడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జిఒపై పునరాలోచించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన పట్టణాల్లో సభలు జరుపుకోడానికి అవసరమైన మైదానాలను కేటాయించాలని, ప్రదర్శనలకు అనుమతినివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు వలి, ప్రకాష్, మసూద్, బాబు, గఫూర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరంపై చర్చకు సరైన వేదిక కాదు

- ఎపి ఇఎన్‌సి నారాయణరెడ్డి
- వాడీవేడీగా జిఆర్ఎంబి భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోదావరి నది యాజమాన్య బోర్డు (జిఆర్ఎంబి) ఛైర్మన్ ఎంకె సింగ్ నేతృత్వంలో హైదరాబాద్‌లోని జలసౌధలో వాడీవేడీగా జరిగింది. ఆయా అంశాలపై తెలంగాణ, ఎపి అధికారులు మంగళవారం తమ తమ వాదనలు వినిపించారు. భేటీకి తెలంగాణ ఇరిగేషన్ శాఖ స్పెషల్ సిఎస్ రజత్ కుమార్, తెలంగాణ ఇఎన్‌సి సి మురళీధర్, ఎపి ఇఎన్‌సి నారాయణరెడ్డి, ఇతర నీటిపారుదల శాఖ అధికారులు హాజరయ్యారు. గోదావరి నదిపై గూడెం, మొండికుంట ప్రాజెక్టుల డిపిఆర్‌లు, సీడ్ మనీ, టెలీమెట్రిల ఏర్పాటు, బోర్డు ఉద్యోగులు తదితర అంశాలపై చర్చించారు. భేటీ అనంతరం ఎపి ఇఎన్‌సి నారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ గోదావరిపై శాస్త్రీయ అధ్యయనం సిడబ్ల్యుసితో చేయించాలని నిర్ణయం జరిగినట్టు చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టులపై మాకు అభ్యంతరాలు ఉన్నాయని వివరించారు. పోలవరంపై చర్చించేందుకు గోదావరి బోర్డు సరైన వేదిక కాదని అభిప్రాయపడ్డారు. ఈ సమస్యలపై ఇప్పటికే చర్చించామని, ఇప్పటికే ఆ సమస్యలు పరిష్కామయ్యాయని తెలిపారు. సాగునీటి శాఖ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్‌కుమార్ మాట్లాడుతూ మొండికుంట వాగు, గూడెం ప్రాజెక్టుల డిపిఆర్‌లుపై చర్చ జరిగిందని, అనుమతులపై ఎపి కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందన్నారు. గోదావరి విషయంలో టెలీమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని, ఆ విషయంలో తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

లోన్‌యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఎల్‌సి సమావేశంలో సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లోన్ యాప్స్ వంటి డిజిటల్ లెండింగ్ ప్లాట్ ఫారమ్స్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి (సిఎస్) డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి సూచించారు. మంగళవారం సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఆయన అధ్యక్షతన 27వ రాష్ట్ర స్థాయి కో ఆర్డినేషన్ కమిటీ (ఎస్ఎల్‌సి) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ యాప్‌ల మోసాలను నియంత్రించేందుకు జాతీయ స్థాయిలో ఒక పరిష్కార మార్గాన్ని కూడా రూపొందించాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా రిజర్వు బ్యాంక్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై ప్రజల్లో విస్తృత అవగాహనను పెంపొందించేలా క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టాలన్నారు. చిట్ ఫండ్ కంపెనీల మోసాలకు సంబంధించిన కేసులను నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌బిఐ జనరల్ మేనేజరు ఇన్‌చార్జి అంజనీమిశ్రా, డిజిఎం రూటా మహాపాత్ర, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్, న్యాయశాఖ కార్యదర్శి సత్య ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం బదులు రాగులు, జొన్నలు


- రెండేసి కేజీల చొప్పున ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- వలంటీర్ల ద్వారా అంగీకార పత్రాల సేకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రేషన్ లబ్ధిదారులకు అందిస్తోన్న బియ్యానికి బదులుగా రెండేసి కేజీల చొప్పున రాగులు, జొన్నలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే నిర్ణయానికి వచ్చినట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ గత నెల 28న జిల్లా కలెక్టర్లకు జారీ చేసిన ఒక సర్క్యులర్‌ను బట్టి స్పష్టమవుతోంది. ప్రతి రేషన్ డిపో పరిధిలోనూ కనీసం పది మంది కార్డుదారులతో అంగీకార పత్రాలు తీసుకోవాలని ఆదేశించారు. వాటిలో అన్నపూర్ణ అంత్యోదయ యోజన (ఎఎవై), ప్రాధాన్యత కుటుంబాలు (పిహెచ్‌హెచ్), అన్నపూర్ణ కార్డు కేటగిరీకి చెందిన కార్డుదారులు ఉండేలా చూడాలని సూచించారు. లబ్ధిదారులు ఏమనుకుంటున్నారో గ్రామ/వార్డులంటీర్లతో సర్వే చేపట్టేందుకు సిద్ధమవుతోంది. వారి ద్వారా సేకరించిన అభిప్రాయాలతో తక్షణమే సమగ్ర నివేదిక పంపాలని ఆదేశించింది. దీనిపై ఈ నెల ఆరున కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. రాష్ట్రంలో దాదాపు 1.40 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయి. జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఎ) కింద కేంద్ర ప్రభుత్వం సుమారు 80 లక్షల కార్డులకు మాత్రమే బియ్యం ఉచిత అందిస్తోంది. మిగిలిన (నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ) 60 లక్షల కార్డులకు సంబంధించిన సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఈ కార్డులకు కూడా ఉచితంగా బియ్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తులు చేసినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతూ వచ్చింది. గత నెల వరకూ రాష్ట్ర ప్రభుతం పంపిణీ చేసే బియ్యానికి కిలో ఒక్కంటికీ రూపాయి చొప్పున వసూలు చేసేది. ఈ నెల నుంచి ఉచితం బియ్యం పంపిణీ చేస్తోంది.

అంగీకార పత్రంలో పేర్కొన్న అంశాలివే

బియ్యం కార్డు నంబరు, కార్డు యజమాని, రేషన్ షాప్ నంబరు వివరాలను సేకరించాలని ప్రభుత్వం సూచించింది. బియ్యం బదులుగా రాగులు, జొన్నలు తీసుకొనేందుకు అంగీకరిస్తున్నారా? లేదా? అనే ప్రశ్నలను పొందుపరిచింది. వాటిని రెండు కిలోల చొప్పున ఇవ్వనున్నారు. ఆ మేరకు బియ్యాన్ని తగ్గిస్తారు.



రాగులు, జొన్నలపై ప్రచారం కోసం సిద్ధం చేసిన కరపత్రాలు

సబ్సిడీ భారం తగ్గించుకునేందుకేనా?

పోషక విలువలున్న రాగులు, జొన్నలు అందివ్వడం మంచిదేనని, అయితే బియ్యానికి కోత పెట్టి ఇవ్వడంపైనే అంతా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పుడు చెప్తున్నట్లుగా లబ్ధిదారుడు బియ్యాన్ని నాలుగు కేజీలు తగ్గించుకుని రాగులు, జొన్నలు తీసుకుంటే ఆ మేరకు బియ్యాన్ని అధిక ధరకు బహిరంగ మార్కెట్లో కొనాల్సి ఉంటుంది. దీంతో, బియ్యం ధరలు పైపైకి చేరే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. బియ్యం స్థానంలో క్రమక్రమంగా రాగులు, జొన్నలు పరిమాణాన్ని పెంచే అవకాశాలు లేకపోలేదనే అనుమానాలూ వ్యక్తమవుతు న్నాయి. లబ్ధిదారుడిపై బియ్యం భారం పెరిగి ప్రభుత్వానికి సబ్సిడీ భారం తప్పుతుందనే చర్చ నడుస్తోంది.

వరి సాగు తగ్గించేందుకేనా?

రాగులు, జొన్నల విస్తీర్ణాన్ని పెంచడానికి బియ్యం స్థానంలో వాటిని పంపిణీ చేయాలని ప్రభుత్వం చెప్పడం ద్వారా వరి విస్తీర్ణాన్ని తగ్గించనున్నట్లుగా కనిపిస్తోంది. అధిక నీటి వినియోగం పేరుతో వరి సాగును తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు రకరకాల ప్రయత్నాలు చేశాయి. రబీలో నీటిని ఇవ్వకుండా ఆంక్షలు విధించాయి. సబ్సిడీ బియ్యాన్ని నిలిపేస్తే వరి సాగు తగ్గించొచ్చని, ధాన్యం కొనుగోలుకు వేల కోట్ల రూపాయలను వెచ్చించాల్సిన భారం తప్పుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎత్తుగడగా ఉందని చర్చ సాగుతోంది.



రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న ఎంఎ గఫూర్

నిర్బంధాన్ని తిప్పికొడదాం

- మూడేళ్ల కాలంలో ఉద్యమాలపై అమానుషం
- సిఐటియు రాష్ట్ర మహాసభలో ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి)

ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని అమలు చేయకపోగా.. వాటిని అమలు చేయాలని కోరుతున్న ఆయా తరగతుల కార్మికులపై నిరంకుశంగా నిర్బంధానికి పాల్పడుతోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ ఆందోళన వ్యక్తం చేశారు. సమరశీల పోరాటాల ద్వారా ఈ నిర్బంధాన్ని తిప్పికొట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభల్లో కార్యకలాపాల నివేదికను ప్రతినిధుల సభలో ఆయన ప్రవేశపెట్టారు. తొలుత ఇటీవల కాలంలో మృతి చెందిన అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర నాయకులు, కరోనా విపత్కర కాలంలో, ప్రమాదాల్లో, రైతాంగ ఉద్యమంలో మరణించిన వారికి నివాళులర్పిస్తూ సిఐటియు నాయకులు అజయ్‌కుమార్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అమరవీరులందరికీ మహాసభ సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించింది. అనంతరం మహాసభలో గఫూర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కార్మిక నేతలను నిర్బంధిస్తే ఈ ప్రభుత్వం కార్మికులందరిపై గృహ నిర్బంధం ప్రయోగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్కీమ్ వర్కర్ల స్థానంలో తమ కార్యకర్తలను నియమించేందుకు ప్రస్తుత ప్రభుత్వం దాడులను విస్తృతం చేసిందన్నారు. జిల్లాలకు ముఖ్యమంత్రి వస్తే గతంలో నాయకులను మాత్రమే నిర్బంధించేవారని, ప్రస్తుతం ప్రజాప్రతినిధులు ఎవరువచ్చినా నాయకులు, కార్యకర్తలందరినీ గృహనిర్బంధం చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. వలస కార్మికులకు అన్ని రకాల సదుపాయాలు, పరిహారం కల్పించాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత చిరుద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. అనంతపురంలో వికలాంగురాలైన విఒఎను వేధించి బలవంతపు మరణానికి ఈ పాలకులు కారకులయ్యారని విమర్శించారు. అక్షయపాత్ర, ఇస్కాన్‌కు మధ్యాహ్న భోజన పథకాన్ని కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే రాష్ట్రవ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలో ఉద్యమించి ఆ విధానాలను తిప్పికొట్టామని వివరించారు. ఇసుక కొరత కారణంగా పనులులేక అలమటిస్తున్న నిర్మాణ కార్మికులను సంఘటితం చేసి సాగించిన పోరాటాలతో ప్రభుత్వం ఇసుక పాలసీ తీసుకొచ్చిందని గుర్తు చేశారు. వేతనం, పని గంటలు అడిగారని తిరుపతి దేవస్థానం కార్మికులపై కక్షపూరితంగా 1400 మందిని తొలగించేందుకు దేవస్థానం సిద్ధపడితే సంఘంగా ఉద్యమించి ఆ కార్మికులకు ఉపాధి నిలబెట్టామన్నారు. ఇంతకాలం కలిసి పని చేసిన కార్మికుల్లో కొందరిని విడదీసి అందులో కొద్దిమందికి మాత్రమే వేతనాలు ఇస్తున్నారని, కొందరికి రోజువారీ కూలి ఇవ్వడంపై 780 రోజులుగా టిటిడి అటవీ కార్మికులు సుదీర్ఘ పోరాటం నిర్వహిస్తున్నారని తెలిపారు. హక్కుల కోసం బొబ్బిలిలో మహిళా కార్మికులు ఉద్యమిస్తే 307 సెక్షన్ కింద కేసు పెట్టి 45 రోజులు జైల్లో నిర్బంధించారని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 690 రోజులుగా అక్కడి కార్మికులు ఆందోళన చేస్తున్నారని గుర్తుచేశారు. అయినా కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గడం లేదని, ఈ మహాసభలో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్మికులు, కర్షకుల సమస్యలపై మూడేళ్ల కాలంలో సంఘం ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటం చేశామన్నారు. గత పోరాటాల అనుభవాలతో ముందుకెళ్లాలని కోరారు. సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లాడుతూ.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్మికులపై నిర్బంధం పెరిగిందన్నారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభకు విచ్చేసిన ఆయన ఆ కమిటీ తరఫున సౌహార్ద సందేశమిచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా కార్మికుల మౌలిక సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఉమ్మడి హైదరాబాద్‌లో ధర్నా చౌక్, ఇందిరాపార్క్ వద్ద సుదీర్ఘ పోరాటాలు సమ్మెలు, ధర్నాలు జరిగాయని, అప్పటి చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్వాడీ ఉద్యోగుల పోరాటం మోపిన ఉక్కు పాదంపై ధర్నా చౌక్ ఉద్యమ కేంద్రంగా ఉందన్నారు. ఆ ధర్నా చౌక్‌ను కెసిఆర్ ప్రభుత్వం నిషేధించిందని, హైకోర్టు జోక్యంతో ధర్నాచౌక్ పునరుద్ధరించబడిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన పోరాటాల్లో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం స్ఫూర్తిగా నెలకొందన్నారు. చాలాకాలంగా ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు అనే పదం తెలంగాణలో ఆంధ్రుల హక్కు తెలుగు ప్రజల హక్కుగా మా రాష్ట్రంలో ఉద్యమించామన్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో పాటు 400 కిలోమీటర్లు పాదయాత్ర చేసి కార్మికులను కలిసి స్వతంత్ర ఐక్య కార్యాచరణతో ఐదు జిల్లాలు తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. నేడు కార్మిక వర్గం మరింత సవాళ్లు ఎదుర్కొంటుందని, కార్మికులు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా సిహెచ్.నర్సింగరావు, వి.ఉమామహేశ్వరరావు, జి.బేబీరాణి, పి.అజయకుమార్, కె.స్వరూపరాణి, కె.ఆజయకుమార్ వ్యవహరించారు.

రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- ఎండి వీరపాండియన్‌కు కౌలు రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, కృష్ణ జిల్లా బాపులపాడు మండలం కానుమోలులో సువేద ఆగ్రో ఇండస్ట్రీస్ రైతులకు అన్యాయం చేస్తోందని, ఆ మిల్లుపై చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ఆటోనగర్‌లోని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆ సంస్థ ఎండి వీరపాండియన్‌ను కౌలు రైతు సంఘం ప్రతినిధులు కలిసి వినతి పత్రం సమర్పించారు. మాండూస్ తుఫాన్ కారణంగా పంటలు తడిచి రంగుమారినట్లు తెలిపారు. పాయ వచ్చిన, గుంటూరు జిల్లాలో ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసే దానికంటే ప్రైవేటు వ్యాపారుల హవా జోరుగా సాగుతోందన్నారు. ప్రతి రైతు 75కేజీల బస్తాకి రు.100 నుంచి రూ.200ల వరకు నష్టపోతున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. మరో వైపు ఆర్‌బికెల్లో గోనె సంచులు సరిపడినంతగా లేవన్నారు. రైతులు మార్కెట్ దోపిడీకి గురి కాకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

కారుణ్యనియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలి : ఇయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో కారుణ్యనియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు) విజ్ఞప్తి చేసింది. విజయవాడలోని ఆర్‌టిసి ప్రధానకార్యాలయంలో ఇయు రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వైవి రావు, పలిశెట్టి దామోదరరావు, డిప్యూటి జనరల్ సెక్రటరి జివి నరసయ్య మంగళవారం ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావును కలసి నూతన సంవత్సరశుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను కొత్త సంవత్సరంలోనైనా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

హక్కుల కోసం పోరాటం

- విశాఖ ఉక్కుపై ఆందోళన తీవ్రతరం
- 26న అఖిలపక్ష సమావేశం
- ఏప్రిల్ ఐదున చలో ఢిల్లీ
- సిఐటియు రాష్ట్ర మహాసభ తీర్మానాలు నిర్ణయాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విశాఖ ఉక్కుపై పోరాటం మరింత ఉధృతం చేయనున్నట్లు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ కాలంలో కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు చేసుకుంటూ వెళ్తోందన్నారు. కార్మికులు, రైతులపై పెద్దఎత్తున దాడి జరుగుతోందని తెలిపారు. వ్యవసాయ నల్లచట్టాలు, లేబర్‌కోడ్‌లతో ఉన్న హక్కులను తీసివేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. పరిశ్రమల్లో సంఘాలు లేకుండా చేయాలని యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంపద సృష్టించే కార్మికవర్గంపై దాడులు పెరిగాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏప్రిల్ ఐదున చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇది హక్కుల కోసం చేస్తున్న పోరాటమన్నారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల సమయంలో వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించారని, ఆ తర్వాత ఇచ్చిన హామీలను పట్టించుకోవడంలేదని తెలిపారు. రైతులపై పెట్టిన 45 వేల కేసులు ఎత్తివేయలేదన్నారు. ఇంకా నిర్బంధం కొనసాగుతుందని తెలిపారు. దీంతో రైతులు మళ్లీ ఉద్యమంలోకి వస్తున్నారని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకూడదని సిఐటియు రాష్ట్ర మహాసభలో తీర్మానం చేసినట్లు తెలిపారు. 32 మంది బలిదానాలతో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైందని గుర్తు చేశారు. ప్లాంట్ నిర్మాణానికి దాదాపు రూ.ఐదు వేల కోట్లు పెట్టుబడి పెడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇప్పటి వరకూ రూ.55 వేల కోట్లు చెల్లించిందని తెలిపారు. బ్యాంకుల నుంచి తెచ్చిన రుణాలకు వడ్డీలు తప్ప స్టీల్‌ప్లాంట్‌కు ఎటువంటి నష్టాలూ లేవన్నారు. ఉత్పత్తిని తగ్గించి నష్టాలుగా పేర్కొంటున్నారని విమర్శించారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో 35 శాతానికిపైగా వాటాలను కేంద్ర విక్రయించిందన్నారు. రెండేళ్లుగా విశాఖ ఉక్కు ఉద్యమం జరుగుతోందని తెలిపారు. ఈ నెల 26న అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి విశాఖ ఉక్కుపై వారి అభిప్రాయాలు కచ్చితంగా చెప్పాలని కోరతామన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

రాష్ట్రంలో షెడ్యూల్డ్ పరిశ్రమల్లో 50 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని, వీరికి కనీస వేతనాలు అమలు కావడం లేదని సిఐటియు రాష్ట్ర కోశాధికారి ఎవి.నాగేశ్వరరావు తెలిపారు. కనీస వేతనాలు పెంచాలని మహాసభలో తీర్మానం చేశామన్నారు. అంగన్‌వాడీ, ఆశ, వెలుగు, ఉపాధిహామీ వంటి అనేక విభాగాల్లో నాలుగు లక్షల మంది స్కీమ్ వర్కర్లు పని చేస్తున్నారని తెలిపారు. వీరికి కనీస వేతనాలు, ఉద్యోగ విరమణ సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మూడు లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంలేదని, సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదని తెలిపారు.

అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు కోసం వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ నిధి నుంచి ప్రభుత్వం తీసుకున్న రూ.1200 కోట్లు వెనక్కిచ్చి కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలతో భారాలు పెరుగుతున్నాయని, వాటిని అదుపులోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ పాల్గొన్నారు.

రోడ్‌షోలు, ర్యాలీల నియంత్రణ దుర్మార్గం

- జిఒను వ్యతిరేకిస్తూ సిఐటియు రాష్ట్ర మహాసభలో తీర్మానం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్రంలో రోడ్ షోలు, ర్యాలీలను నియంత్రిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ దుర్మార్గమని, దీన్ని తీవ్ర వ్యతిరేకిస్తూ పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ ప్రతిపాదించగా, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ బలపర్చారు. ఈ తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై అనుసరిస్తోన్న దుర్మార్గ వైఖరిని నిరసిస్తున్నట్లు తెలిపారు. కందుకూరు, గుంటూరు ఘటనలను ఆసరాగా చేసుకొని రాష్ట్రంలో సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిషేధించడం అప్రజాస్వామికమన్నారు. రైతులు, కార్మికులు, ప్రజలు తమ హక్కుల కోసం ఆందోళన చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అణచివేస్తోందని తెలిపారు. కనీస వేతనాల అమలుకు పోరాటమే మార్గమని మహాసభలో మరో తీర్మానాన్ని ఆమోదించారు. కనీస వేతనాలు సవరించి 15 ఏళ్లు కావస్తున్నా బోర్డు నియామకం జరగలేదని మహాసభ ఆవేదన వ్యక్తం చేసింది.

కార్మిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ ఐదున చలో ఢిల్లీ, మార్చిలో చలో అసెంబ్లీ కార్యక్ర మాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంటును అమ్మాలని బిజెపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా మహాసభ తీర్మానం చేసింది. విశాల ఐక్య ప్రజా పోరాటాల ద్వారా విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని మహాసభ కార్మికులకు పిలుపునిస్తూ తీర్మానం ఆమోదించింది.

పొగాకు రైతులను ఆదుకోవాలి

పొగాకు బోర్డు ఇడికి రైతు సంఘాల వినతి



పొగాకు బోర్డు ఎదుట నినాదాలు చేస్తున్న రైతులు, నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన తమను ఆదుకోవాలని పొగాకు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరులోని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబును రైతులు, రైతు సంఘాల నాయకులు కలిసి మంగళవారం వినతిపత్రం అందచేశారు. పూర్తిగా దెబ్బతిన్న పొగాకు తోటలకు ఎకరాకు రూ.25 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న తోటలకు రూ.10 వేలు ఇప్పించాలని, వడ్డీ లేకుండా రుణాలు రీ-షెడ్యూలు చేసి, మళ్లీ సాగు చేసుకోవడానికి తక్షణమే బ్యారన్‌కు రూ.లక్ష చొప్పున వడ్డీ లేని రుణం ఇవ్వాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పొగాకు బోర్డు మాజీ సభ్యులు చుండూరి రంగారావు మీడియాతో మాట్లాడుతూ.. పొగాకు బోర్డు అనుమతించిన మేరకు కూడా ఈ ఏడాది సాగు పూర్తి కాలేదని, తుపాను ప్రభావంతో ఆ కాస్త పంట కూడా దెబ్బతిన్నదని తెలిపారు. ప్రకాశం జిల్లాలో 1,01,082 ఎకరాల్లో సాగు చేయగా.. 49,735 ఎకరాల్లోని పంట తుపాను ప్రభావంతో దెబ్బతిన్నదని తెలిపారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. రైతులను ఆదుకునే విషయంలో తమకు సంబంధం లేన్నట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పించుకోవడం సరికాదన్నారు. అత్యవసరంగా పొగాకు బోర్డు సమావేశం జరపాలని, కేంద్ర కమీషన్ వెంటనే పంట ప్రభావిత ప్రాంతాలను సందర్శించాలన్నారు.

పొగాకు బోర్డు ద్వారా పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాల నాయకులు పమిడి వెంకటరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, వి.బాలకోటయ్య, పొగాకు రైతులు పాల్గొన్నారు.

సంపాదకీయం


నోట్ల రద్దు పెనువిపత్తే!

సామాన్యుడి జీవితాన్ని అల్లకల్లోలం చేసిన మోడీ సర్కారు నిర్ణయాల్లో ఒకటైన పెద్ద నోట్ల రద్దును దేశ అత్యున్నత న్యాయస్థానం సమర్థించినట్లుగా భావించలేం. సాంకేతికంగా మాత్రమే తప్పు బట్టలేమని చెప్పిన న్యాయస్థానం కేంద్ర ప్రజావ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేసింది. దేశానికి ఎనలేని దుస్థితిని, ఆర్థిక పతనాన్ని తెచ్చిపెట్టిన మితిమీరిన అధికార చర్యను సరిదిద్దలేమనే సుప్రీం నిస్సహాయతను ఈ తీర్పు ప్రతిబింబిస్తోంది. పెద్ద నోట్ల రద్దు యొక్క లక్ష్యం నెరవేరిందా లేదా అనేదానితో న్యాయస్థానానికి సంబంధం లేదని మెజార్టీ తీర్పు పేర్కొనడం ఒకింత ఆశ్చర్యం కలిగిస్తుంది. కోట్లాది మంది ప్రజల జీవితాలను అతలాకుతలం చేసిన ఇటువంటి అంశంలో న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదా?. 1934 నాటి ఆర్‌బిఐ చట్టంలోని సెక్షన్ 26(2)ను ఇది ఉల్లంఘించడం లేదని, పెద్దనోట్లను రద్దు చేసే చట్టబద్ధమైన అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని మాత్రమే ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీతో తీర్పు చెప్పింది. మెజార్టీ తీర్పుతో ఏకీభవించని జస్టిస్ బివి నాగరత్న తన అసమ్మతి తీర్పులో పెద్ద నోట్ల రద్దును చేపట్టాలని ఆర్‌బిఐ, ప్రభుత్వానికి సిఫార్సు తప్పనిసరని ఆర్‌బిఐ చట్టంలోని సెక్షన్‌ను ఉటంకించారు. ఈ నిర్ణయం అమలు చేయడానికి ముందు పార్లమెంట్ ఆమోద ముద్ర పొందడం లేదా ఆర్డినెన్స్ ద్వారా కానీ చేయాల్సిందని స్పష్టంగా పేర్కొన్నారు..

నోట్ల రద్దు ప్రక్రియను పరిశీలిస్తే... 2016 నవంబర్ 8న అర్ధరాత్రి రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. నల్ల ధనాన్ని వెలికి తీయడం, నకిలీ కరెన్సీ సమస్యను తుదముట్టించడం, ఉగ్రవాదులకు నిధులు అందకుండా చేయడం, అవినీతిని నిర్మూలించడం, ఆర్థిక వ్యవస్థలో నగదు చలామణిని తగ్గించడం లక్ష్యాలుగా పేర్కొన్నారు. వాటిల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదు. దీనికి విరుద్ధంగా, ప్రజల్లో చలామణిలో వున్న కరెన్సీ, పెద్ద నోట్ల రద్దు సందర్భంగా రూ.17.7లక్షల కోట్ల నుండి ఇప్పుడు రూ.30.88 లక్షల కోట్లకు పెరిగిందని ఆర్‌బిఐ పేర్కొంది. అంటే 71.84శాతం పెంపు నమోదైంది. ఈ నిర్ణయం పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా ప్రజానీకానికి పెనువిపత్తులా పరిణమించింది. నోట్లమార్పిడి, ప్రత్యామ్నాయ వ్యవస్థలకు ఎలాంటి నిబంధనలు రూపొందించకపోవడంతో జనం బ్యాంకుల వద్దకు పరుగులు తీశారు. నగదు కోసం క్యూలలో నిలబడటం, తోపులాటల వల్ల నెల రోజుల్లోనే 82 మంది మరణించినట్లు వార్తా కథనాలు వచ్చాయి. వాస్తవానికి ఆ మృతుల సంఖ్య మరిన్ని రెట్లుండవచ్చు. కోట్లాదిమంది ప్రజలకు ఉపాధి కలిగించే దేశ అసంఘటిత రంగం తీవ్ర విధ్వంసానికి గురైంది. వాణిజ్య, పారిశ్రామిక రంగాలు దెబ్బతిన్నాయి. జీవనోపాధులను దెబ్బతీసింది. డిజిటల్ లావాదేవీలు పెంచేందుకు ఆర్థిక వ్యవస్థనే షాక్‌కు గురిచేయాల్సిన పని లేదు. పెద్దనోట్ల రద్దు ద్వారా బ్లాక్ మనీని అంతం చేస్తామని మోడీ చేసిన ప్రచారానికి, ఆ తరువాత రూ.2000 నోటును ప్రవేశపెట్టడానికి మధ్య అంతరం గురించి ఆలోచిస్తే... బిజెపి సర్కారు తీసుకున్న నిర్ణయాలకు, చెప్పిన దానికీ పొంతనే కనిపించదు.

జస్టిస్ బివి నాగరత్న తీర్పు మోడీ పరిపాలనపై అభియోగపత్రం. పెద్ద నోట్ల రద్దుపై కసరత్తును కేవలం 24 గంటల్లోనే ముగించారని, దీన్ని ఆర్‌బిఐ చట్టంలోని సెక్షన్ 26(2) ప్రకారం సిఫార్సుగా భావించలేమని పేర్కొన్నారు. ఆర్‌బిఐకి ఎటువంటి స్వతంత్ర ఆలోచన లేదనే అంశాన్ని ఎత్తిచూపారు. నోట్ల రద్దు లక్ష్యాలు ఏమైనప్పటికీ, దానిని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. భిన్నాభిప్రాయంతో వెలువడిన కీలక తీర్పుల్లో ఇది ఒకటిగా సుప్రీంకోర్టు చరిత్రలోనే నిలిచిపోతుంది. మొత్తంగా చూసినప్పుడు సుప్రీంకోర్టు తీర్పు మోడీ సర్కారు తీసుకున్న నిర్ణయం వల్ల తలెత్తిన పర్యవసానాలను ఏవిధంగానూ సమర్థించలేదు. దీనిని సుప్రీం క్లీన్ చిట్ ఇచ్చినట్టుగా మోడీ ప్రభుత్వం భావిస్తే అంతకన్నా హాస్యాస్పదం ఇంకొకటి ఉండదు.

మంచి మాట



సంపద సముద్రపు నీరు లాంటిది. మనం ఎంత ఎక్కువ తాగితే అంత ఎక్కువ దాహం అవుతుంది.

- ఆర్థర్ స్కోపెన్ హౌర్, జర్మన్ తత్వవేత్త.

విశ్లేషణ

హిందూ దేవాలయాల 'విముక్తి'?

బిజెపి కొత్త (పాతదే) రాజకీయం





ఎం.వి.ఎస్.శర్మ

ఈమధ్య కాలంలో బిజెపి ఒక వివాదాన్ని రాజేయడానికి మళ్ళీ ప్రయత్నిస్తోంది. ప్రభుత్వం పెత్తనం నుండి హిందూ దేవాలయాలకు "విముక్తి" కల్పించాలన్నది వాళ్ళ డిమాండ్. స్వయంగా కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఇందుకోసం తమ ప్రభుత్వం త్వరలో ఒక చట్టం తీసుకురానున్నదంటూ ఓ ప్రకటన కూడా చేశారు. ఇక బిజెపి అధికారంలో లేని రాష్ట్రాల్లో అక్కడి ఆరెస్సెస్ విభాగాలు ఈ విషయం మీద కోర్టుల్లో వివాదాలు లేపుతున్నాయి. తమిళనాడులో 1959లో చేసిన 'తమిళనాడు హిందూ రెలిజియస్ అండ్ చారిటబుల్ ట్రస్ట్స్ యాక్ట్‌ను రద్దు చేయాలంటూ వాళ్ళు కోర్టును ఆశ్రయించారు.

ఆరెస్సెస్, బిజెపి వాదనలు

హిందూ దేవాలయాలను నిర్వహించుకోడానికి ఒక ప్రత్యేకమైన బోర్డును ఏర్పాటు చేస్తామని 2021లో బిజెపి హామీ ఇచ్చింది. ఆ బోర్డులో హిందూ పండితులు, సాధువులు సభ్యులుగా ఉంటారని సూచించింది. ఇంతవరకూ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సంస్థలను ప్రైవేటు గ్రూపులకు ఏవిధంగా అప్పజెప్తారన్న ప్రశ్నకు వారినుండి వివరణ లేదు. అసలు పూర్తి వైవిధ్యంతో ఉన్న, భిన్న స్రవంతుల విశ్వాసాలతో ఉన్న హిందూ మతానికి ప్రాతినిధ్యం వహించగలిగేది ఎవరన్నది పెద్ద వివాదంగా మారడానికి మాత్రమే బిజెపి ప్రతిపాదన తోడ్పడుతుంది. ఆ మధ్య తిరుమలలో వెయ్యి కాళ్ళ మంటపాన్ని కూలగొట్టారు. ఆ విధంగా కూలగొట్టడాన్ని ఆగమశాస్త్రం బలపరుస్తున్నదంటూ ఒక వైష్ణవ సాంప్రదాయానికి ప్రతినిధిగా చెప్పుకునే ఒక జియ్యరు స్వామిగారు ప్రకటిస్తే, అలా కూలగొట్టడం ఆగమ శాస్త్రాలకు విరుద్ధం అంటూ మరో జియ్యరుస్వామి ప్రకటించారు. వైష్ణవం, శైవం, శాక్తేయం, ఇలా రకరకాల మతాలు హిందూమతంగా పరిగణించబడుతు న్నాయి. కొంతమంది పండితులో, సాధువులో దేవాలయాల మీద పెత్తనాన్ని తీసుకోవడం అంటే ఆ పండితులకు, సాధువులకు తక్కిన భక్తులకు లేని అధికారాలు ఎవరిచ్చారు? ఎక్కడ నిర్ణయిస్తారు?

ఈ రోజు మన దేశంలో మత విశ్వాసాల ప్రాతిపదికన జరుగుతున్న వ్యాపారం లక్షల కోట్లలో ఉంది. ఇదంతా ప్రజాధనమే. ఇప్పుడు ప్రభుత్వం ఆధ్వర్యంలో దేవాలయాలు ఉంటున్నందువలన ఎక్కడ తేడా వచ్చినా భక్తులు, ప్రజా ప్రతినిధులు అడగడానికి, జోక్యం చేసుకోడానికి వీలు ఉంది. బిజెపి చెప్తున్న విధంగా గనుక చట్టాలను మార్చితే అంత అపారమైన ధనం, రూ.లక్షల కోట్ల విలువైన ఆస్తులు అన్నీ కొందరు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడమే అవుతుంది.

రాజ్యాంగం ఏం చెప్తోంది?

మన రాజ్యాంగం 25వ అధికరణలో పౌరులు తమకు నచ్చిన మతాన్ని ప్రబోధించడానికి, ఆచరించడానికి, ప్రచారం చేసుకోడానికి పూర్తి హక్కు కలిగివున్నారని ఉంది. దానినే మనం మతస్వేచ్ఛ అంటాం. ఆ హక్కును కాపాడే బాధ్యత ప్రభుత్వాలది. అయితే అదే అధికరణ లోని ఒక ఉప అధికరణ 25(2)లో మతానికి సంబంధించిన లౌకిక పార్శ్వం (సెక్యులర్ యాస్పెక్ట్ ఆఫ్ రెలిజియన్) విషయంలో చట్టాలు రూపొందించే పరిమితమైన హక్కు ప్రభుత్వానికి ఉందని కూడా రాజ్యాంగం పేర్కొంది. అంటే మతానికి సంబంధించిన విశ్వాసాలు, నమ్మకాలు, సాంప్రదాయాలు, ఆచారాలు వంటివి ఒక పార్శ్వం అయితే ఆ మతానికి సంబంధించిన దేవాలయాల నిర్వహణ, వాటి ఆస్తులు, ఆదాయాలు, ఉద్యోగుల జీతాలు, వారి సంక్షేమం, భక్తుల నుండి వసూలు చేసే రకరకాల రుసుములు, ప్రచురణలు, అమ్మకాలు, భక్తులు విరాళాలుగా ఇచ్చే స్థిర, చరాస్తుల సక్రమ నిర్వహణ-ఇటువంటివన్నీ లౌకిక పార్శ్వం కిందకు వస్తాయి. "ఈ లౌకిక విషయాలన్నింటికీ అతీతం మా విశ్వాసం" అని సంఘపరివారం రెచ్చగొట్టవచ్చు కాని వాళ్ళ కన్ను పడింది మాత్రం ఈ లౌకిక పార్శ్వం మీదనే. మన సామాజిక వ్యవస్థ చాలా అసమానతలతో, వివక్షతలతో నిండి వుంది. సమాజం వదిలించుకోవలసిన దురాచారాలెన్నో ఉన్నాయి. కుల వివక్షత, లింగవివక్షత నేటికీ కొనసాగుతున్నాయి. వాటిని మతం పేరుతో, ధర్మశాస్త్రాల పేరుతో సమర్థిస్తున్నారు. విశ్వాసం పేరుతో నేడు "అంటరానితనాన్ని సమర్థిస్తాం, పాటిస్తాం, అది మా హక్కు , మా విశ్వాసం" అని ఎవరైనా అనగలరా? బాల్య వివాహాలను, సతి దురాచారాన్ని, వరకట్నాన్ని, జోగినీ వ్యవస్థను విశ్వాసం పేరుతో సమర్థించగలరా? పలు సందర్భాలలో దేవాలయాల్లో సాగిన అవినీతి బాగోతాలు బైటపడ్డాయి. దేవుడి మాన్యాలను అక్రమంగా వ్యక్తులు అనుభవిస్తున్న ఉదంతాలకు లెక్క లేదు. అటువంటప్పుడు "ఇదంతా మత స్వేచ్ఛతో ముడిపడి వుంది. కనుక ప్రభుత్వం జోక్యం చేసుకోజాలదు" అని చెప్పి చేతులు ముడుచుకుని కూచోవచ్చా?

> **మతానికి సంబంధించిన విశ్వాసాలు, నమ్మకాలు, సాంప్రదాయాలు, ఆచారాలు వంటివి ఒక పార్శ్వం అయితే ఆ మతానికి సంబంధించిన దేవాలయాల నిర్వహణ, వాటి ఆస్తులు, ఆదాయాలు, ఉద్యోగుల జీతాలు, వారి సంక్షేమం, భక్తుల నుండి వసూలు చేసే రకరకాల రుసుములు, ప్రచురణలు, అమ్మకాలు, భక్తులు విరాళాలుగా ఇచ్చే స్థిర, చరాస్తుల సక్రమ నిర్వహణ-ఇటువంటివన్నీ లౌకిక పార్శ్వం కిందకు వస్తాయి. "ఈ లౌకిక విషయాలన్నింటికీ అతీతం మా విశ్వాసం" అని సంఘపరివారం రెచ్చగొట్టవచ్చు కాని వాళ్ళ కన్ను పడింది మాత్రం ఈ లౌకిక పార్శ్వం మీదనే.**

> **రాజ్యాంగం మతపరమైన విశ్వాసాలను కలిగి వుండే హక్కును కాపాడుతుంది. దానర్థం మతానికి సంబంధించిన లౌకిక, ఆర్థిక, రాజకీయ అంశాల విషయంలో ప్రభుత్వం జోక్యం ఉండకూడదని ఏమాత్రమూ కాదు. ఆ అంశాలపై చట్టాలను రూపొందించే హక్కు ప్రభుత్వానికి ఉంది. ఇదే సుప్రీంకోర్టు వైఖరి.**

సుప్రీంకోర్టు వైఖరి ఏమిటి?

గడిచిన కాలంలో తన ముందుకు వచ్చిన అనేక వివాదాలపై తీర్పులనిచ్చే క్రమంలో సుప్రీంకోర్టు ఒక నికరమైన వైఖరినే తీసుకుంటూ వచ్చింది. రాజ్యాంగం మతపరమైన విశ్వాసాలను కలిగి వుండే హక్కును కాపాడుతుంది. దానర్థం మతానికి సంబంధించిన లౌకిక, ఆర్థిక, రాజకీయ అంశాల విషయంలో ప్రభుత్వం జోక్యం ఉండకూడదని ఏమాత్రమూ కాదు. ఆ అంశాలపై చట్టాలను రూపొందించే హక్కు ప్రభుత్వానికి ఉంది. ఇదే సుప్రీంకోర్టు వైఖరి. ఆ క్రమంలోనే తమిళనాడు ప్రభుత్వం 1959లో చేసిన చట్టం చెల్లుతుందని, ఆ విధమైన చట్టాలను చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు తీర్పు 1959 లోనే ఇచ్చింది.

ప్రభుత్వం జోక్యం ఉండితీరాలి - కమిషన్ నివేదిక

1960లో కేంద్ర ప్రభుత్వం డా. సి.పి.రామస్వామి అయ్యర్ నేతృత్వంలో "హిందూ రెలిజియస్ ఎండోమెంట్స్ కమిషన్" ను ఏర్పాటు చేసింది. హిందూ మత ధార్మిక సంస్థల పరిస్థితులను అధ్యయనం చేయడం ఆ కమిషన్ పని. అధ్యయనం చేసిన తర్వాత రామస్వామి కమిషన్ చాలా స్పష్టంగా "దేవాలయాల, ధార్మిక సంస్థల నిర్వహణలో అవకతవకలు, అవినీతి జరగకుండా ఉండాలంటే అందుకు ప్రభుత్వం కంట్రోలు వాటిపై ఉండడం తప్పనిసరి" అని నివేదికలో పేర్కొంది. కొన్ని రాష్ట్రాలలో అక్కడి ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించకపోవడం వల్లనే అక్కడి దేవాలయాల్లో పలు అక్రమాలు జరిగాయని దృష్టాంతాలతో నివేదికను సమర్పించింది. ప్రభుత్వం జోక్యం చేసుకోవడం జరిగిన తర్వాతనే పలు దేవాలయాల అభివృద్ధి జరిగింది. అందుకు తిరుమల తిరుపతి దేవస్థానమే ఒక పెద్ద ఉదాహరణ. దేవాలయం నిర్వహణతోబాటు పలు సేవా, విద్యా, వైద్య, సహాయ కార్యక్రమాలు టిటిడి ఆధ్వర్యంలో సాగుతున్నాయి. ఇటువంటి దేవాలయాలు ఇంకా చాలానే ఉన్నాయి. వీటికి ప్రతీరోజూ కోట్లలో ఆదాయం వస్తోంది. హుండీలో పడే ప్రతీ పైసాకూ లెక్క ఉండే విధానం అమలులో ఉంది. ప్రభుత్వ పర్యవేక్షణ వల్లనే ఇది జరుగుతోంది. అదే జవాబుదారీతనం లేని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో దేవాలయాల నిర్వహణ పడితే పరిస్థితి ఏమౌతుందో ఊహించుకోవడం కష్టమేమీ కాదు. కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలలో దేవాలయాల్లో అర్చకుల నియామకం, శిక్షణ విషయంలో దళిత, బి.సి కులాల వారికి అవకాశాలు కల్పించడం, స్త్రీలను అర్చకులుగా నియమించడం వంటి సంస్కరణలు వచ్చాయి. ఛాందసవాదులు, సాధువులు దేవాలయాలపై పెత్తనం మొదలుపెడితే ఇటువంటివి జరుగుతాయా? అపారమైన ప్రజాసంపద దేవాలయాల వద్ద పోగుబడి వుంది. దానిని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వానికి లేదా?

ప్రస్తుత నయా ఉదారవాద సమాజంలో ప్రతీదీ సరుకుగా దిగజారిపోయింది. ప్రజల విశ్వాసాలూ సరుకుగా మారిపోతున్నాయి. గాడ్ మార్కెట్ అన్న పుస్తకంలో రచయిత్రి మీరా నందా అన్ని మతాల ప్రజల్లోనూ పెరిగిన మతపరమైన కార్యక్రమాల జోరు గురించి, ఆ ప్రజల విశ్వాసాలే లక్షల కోట్ల వ్యాపారంగా ఏవిధంగా మారిపోతున్నాయన్న వివరం గురించి లోతుగా పేర్కొన్నారు. ఇప్పుడు మన దేశంలో ఆ వ్యాపారం ఎంత విస్తరిస్తున్నా, దానికి కేంద్రాలుగా ఉన్న దేవాలయాల మీదనైనా ప్రభుత్వం అదుపు కలిగి వుంది. దానిని కూడా లేకుండా చేసేస్తే అప్పుడిక ఆ లక్షల కోట్లను తమకు నచ్చినట్లు వాడుకోవచ్చు. ఎవరికీ జవాబు చెప్పనవసరం ఉండదు. ఇదే బిజెపి వ్యూహం. కాసుల మీద ప్రేమకు మత విశ్వాసం అన్న ముసుగు వేసి ప్రజానీకాన్ని రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకోవాలన్నదే వారి వ్యూహం.

మరింత పారదర్శకంగా, మరింత జవాబుదారీతనం ఉండేలా దేవాలయాల లౌకిక వ్యవహారాలను ప్రభుత్వం నిర్వహించడమే సరైన మార్గం. అయినా, మోక్షసాధనే జీవిత లక్ష్యంగా ప్రకటించుకుని, ఉపనిషత్తుల్లోని పరమాత్మ సారాన్ని వెతికి పట్టుకుని, సర్వం త్యజించి విరాగులైనవారికి, అంతా మిథ్య అని ప్రబోధించేవారికి, దేవాలయాల నిర్వహణ బాధ్యత అప్పజెప్తే పాపం, వాళ్ళంతా శ్లేష్మంలో పడ్డ ఈగల్లా అయిపోరూ! యోగులకు, సర్వసంగ పరిత్యాగులకు ఇంతటి శిక్షలు వేయడం బిజెపికి తగునా? ★

సమస్య

ఉపాధి హామీ ఉసురు తీస్తున్న కేంద్రం



వి. రాంభూపాల్

దేశంలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు స్వాతంత్ర్యానంతరం చట్ట ప్రకారం పనికి హామీ కల్పించబడిన ఏకైక చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం. దీని ద్వారా దేశంలోని సుమారు 50 కోట్ల మందికి పని హక్కు కల్పించాల్సి వున్నప్పటికీ నేటికి 33 కోట్ల మందికి కూడా పని పెట్టలేని స్థితి వుంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ పేదలకు విస్తరించాల్సి వుండగా క్రమంగా కుదించబడుతున్నది. ముఖ్యంగా బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత ఎనిమిది సంవత్సరాల్లో ఒకటి రెండు సంవత్సరాలు మినహా ఈ పథకానికి నిధులను భారీగా తగ్గిస్తూ వచ్చింది. దీనివల్ల పని దినాలు తగ్గాయి. చేసిన పనికి నెల నుండి మూడు నెలల వరకు బిల్లులు పెండింగ్‌లో వుంటున్నాయి. నిధుల కోసం కేంద్రాన్ని నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తులు, విన్నపాలకు పరిమితమైంది. ప్రధాన ప్రతిపక్షం అధికార ఆశ తప్ప ఉపాధి కూలీల గోడు పట్టడంలేదు. మతతత్వ రాజకీయాల చాటున కార్పొరేట్ అనుకూల విధానాలను వేగంగా అమలు చేస్తున్న బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని మెరుగు చేయడం కాదు, కుదించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నెల 5న ఈ పథకాన్ని సమీక్షించి కొన్ని కొత్త నిర్ణయాలు తీసుకోనున్నది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ పథకాన్ని భారీగా కుదించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. పేదలకు పని అన్నది భిక్ష కాదు, హక్కు అని పాలకులు గుర్తించేటట్లు ఉద్యమించాలి.

ఉపాధి హామీ చట్టం నేపథ్యం

2005 ఆగస్టు 23న దేశ పార్లమెంట్ చారిత్రాత్మకమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఆమోదించింది. దీన్ని ఆంధ్రప్రదేశ్ లోని అత్యంత వెనుకబడిన, నిత్య కరువుకు గురౌతున్న అనంతపురం జిల్లాలోని నార్పల మండలం బండమీదపల్లిలో నాటి ప్రధాని మన్మోహన్ 2006 ఫిబ్రవరి 2న ప్రారంభించారు. ఈ చట్టం వచ్చిన రెండు నేపథ్యాలను కావాలనే పాలక పార్టీలు, ప్రధాన మీడియా విస్మరిస్తుంటాయి. అందులో ఒకటి, నాటి ప్రజల జీవన పరిస్థితులు. రెండు, రాజకీయ పరిణామాలు. స్వాతంత్ర్యానంతరం పాలకవర్గాలు అమలు చేసిన ఆర్థిక విధానాలు అంతిమంగా ఒకవైపు కొద్దిమంది దగ్గర సంపద పోగుబడడానికి. మరోవైపు పేదరికం, నిరుద్యోగం, దారిద్ర్యం పెరిగిపోవడానికి కారణమయ్యాయి. ఈ పరిస్థితుల నుండి పాలకులు బయటపడడానికి ఎద్దులు, బండ్లు, ధోవతి, బియ్యం, సహకార రుణాల లాంటి సంక్షేమ పథకాలను అమలు చేశారు. ఈ పథకాలన్నీ తాత్కాలిక ఉపశమనాలే కావడంవల్ల ప్రజల జీవన విధానాన్ని మార్చలేకపోయాయి. ఈ పరిస్థితుల్లో 1991లో పి.వి.నరసింహారావు నాయకత్వంలో ఏర్పడిన కాంగ్రెసు సంకీర్ణ ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాల పేరుతో ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను అమలు చేసింది. దీంతో ప్రజలను పెనం నుండి పొయ్యి లోకి తోసినట్లయింది. ముఖ్యంగా గ్రామీణ పేదల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రజల హక్కుగా ఉపాధి హామీ చట్టం రావలసి వచ్చింది.


రెండవ నేపథ్యం, రాజకీయ పరిణామాలు. ఆర్థిక విధానాల దుష్ఫలితాలు రాజకీయ, సామాజిక రంగాల్లో మార్పులకు దారితీస్తాయి. పాలక పార్టీల్లో ఎవరికి పూర్తి మెజారిటీ రాని పరిస్థితి ఏర్పడింది. ప్రజా సమస్యలపై నిత్యం పనిచేసిన వామపక్షాల బలం చట్టసభల్లో గణనీయంగా పెరిగింది. 2004లో వామపక్షాల మద్దతు లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడే పరిస్థితి లేదు. వామపక్షాల మద్దతుతో ఏర్పడిన యుపిఎ-1 సంకీర్ణ ప్రభుత్వం కనీస ఉమ్మడి ప్రణాళిక ఆధారంగా పరిపాలించాల్సి వచ్చింది. అందులో గ్రామీణ ఉపాధి హామీ చట్టంతో పాటు అనేక కీలకమైన అంశాలు వున్నాయి.

> **కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనం కూలీలకు ఇవ్వాలంటే...ఉపాధి హామీ చట్టానికి ప్రస్తుత కూలీల సంఖ్యకు అనుగుణంగా రూ.ఒక లక్ష 20 వేల కోట్లు కేటాయించాలి. కాని ఈ సంవత్సరం రూ. 73 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో గత సంవత్సరం బకాయిలు రూ. 8 వేల కోట్లు వున్నాయి. అంటే కేవలం రూ. 65 వేల కోట్లు. ఈ చట్టం అమలుకు అవసరమైన నిధుల్లో సగం కూడా కేటాయించకుండా తన వర్గబుద్ధిని చాటుకుంది. కష్టజీవులకు చట్టప్రకారం నిధులు ఇవ్వడానికి ఇష్టపడలేదు. తన మిత్రులైన కార్పొరేట్ కంపెనీలకు ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో బ్యాంకు అప్పుల రద్దు, ప్రత్యక్ష, కార్పొరేట్ పన్నుల తగ్గింపు, వివిధ రాయితీల కింద సుమారు రూ. లక్షన్నర కోట్లు కట్టబెట్టింది.**

ఉపాధి చట్టం ఉద్దేశ్యం- అమలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ముఖ్యంగా రెండు లక్ష్యాలు కీలకమైనవి. ఒకటి గ్రామీణ పేదలకు ప్రతి ఆర్థిక సంవత్సరం కనీసం వంద రోజుల పనిని చట్టం ప్రకారం కల్పించడం, పేదల జీవితాలకు కనీస భద్రతను ఇవ్వడం. రెండు, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం. ఈ చట్టం మన రాష్ట్రంలో 2021 లెక్కల ప్రకారం 13 జిల్లాల్లో 661 మండలాలు, 13,285 గ్రామ పంచాయితీలు, 47,115 నివాస ప్రాంతాల్లో అమలవుతుంది. 71,39,720 జాబ్ కార్డులు వున్నాయి. 5,99,739 స్వయం సహాయక సంఘాల్లో 1,03,55,184 మంది కూలీలు ఈ చట్టం ద్వారా పనికి అర్హులు. ఈ చట్టం ద్వారా మన రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో రూ. 22,82,661.53లతో 38,18,487 పనులు, గ్రామీణ మౌళిక సదుపాయాల కోసం రూ.7,04,847.62లతో 92,9106 పనులు, రూరల్ శానిటేషన్‌కు రూ.117754.26లతో 11,21,648 పనులు కల్పించబడ్డాయి. చట్ట ప్రకారం అర్హులందరికి పనులు కల్పించి, అందుకవసరమైన నిధులను కేటాయించి వుంటే గ్రామీణ ప్రజల జీవితాల్లో పెద్ద మార్పు వచ్చి వుండేది. అయితే పాలక పార్టీలకు ఈ చట్టాన్ని అమలు చేయడం ఇష్టంలేదు కాబట్టే చట్టం అమలులోకి వచ్చిన 17 సంవత్సరాల తర్వాత కూడా పనికి అర్హత వున్న వారిలో కేవలం 35 కుటుంబాలకు కూడా వంద రోజుల పని కల్పించబడడంలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనం ప్రకారం ఉపాధి హామీ కూలికి రోజుకు రూ. 237 ఇవ్వాలి. ప్రస్తుతం మన రాష్ట్రంలో రూ. 142.27 పైసలు మాత్రమే అందుతుంది.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనం కూలీలకు ఇవ్వాలంటే...ఉపాధి హామీ చట్టానికి ప్రస్తుత కూలీల సంఖ్యకు అనుగుణంగా రూ.ఒక లక్ష 20 వేల కోట్లు కేటాయించాలి. కాని ఈ సంవత్సరం రూ. 73 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో గత సంవత్సరం బకాయిలు రూ. 8 వేల కోట్లు వున్నాయి. అంటే కేవలం రూ. 65 వేల కోట్లు. ఈ చట్టం అమలుకు అవసరమైన నిధుల్లో సగం కూడా కేటాయించకుండా తన వర్గబుద్ధిని చాటుకుంది. కష్టజీవులకు చట్టప్రకారం నిధులు ఇవ్వడానికి ఇష్టపడలేదు. తన మిత్రులైన కార్పొరేట్ కంపెనీలకు ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో బ్యాంకు అప్పుల రద్దు, ప్రత్యక్ష, కార్పొరేట్ పన్నుల తగ్గింపు, వివిధ రాయితీల కింద సుమారు రూ. లక్షన్నర కోట్లు కట్టబెట్టింది. బిజెపి అధికారంలోకి రాకముందు 2013-14లో వంద రోజులు పూర్తి చేసిన కార్మికుల సంఖ్య 4,70,000 వుండగా, 2014-15లో 2,50,000, 2015-16 నాటికి 1,70,000 మందికి తగ్గిపోయింది. ప్రస్తుతం 2,10,000 వుంది. సగటు కూలీ పనిదినాల సంఖ్య 2013-14లో 46 రోజులు వుండగా, 2014-15లో 39 రోజులకు తగ్గింది. ప్రస్తుతం 33 రోజులు మాత్రమే పనులు కల్పిస్తున్నారు.కేరళలో సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం మాత్రమే ఉపాధి కూలీలతో పాటు, వ్యవసాయ కూలీలకు రోజు కూలీ రూ.600 అమలు చేస్తున్నది. దేశంలో గ్రామీణ పేదలతో పాటు, పట్టణ పేదలకు కూడా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం కేరళ. ఈ మధ్యనే రాజస్థాన్ ఈ దిశగా చర్యలు తీసుకుంది. వ్యవసాయ రంగంలోకి వచ్చిన ఆధునిక యంత్రాలు గ్రామీణ ప్రజల వ్యవసాయ పనిదినాలను తగ్గించి వేస్తున్నాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ లెక్కల ప్రకారం గత పది సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా ఈ సంవత్సరం 15 రాష్ట్రాల్లో 57.8 శాతం మంది మహిళలు ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఇందులో కేరళ, తమిళనాడు అగ్రభాగన వున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాలు ముఖ్యంగా ప్రధాని స్వంత రాష్ట్రం గుజరాత్‌లో గాని, ఉత్తరప్రదేశ్‌లో గాని తామ ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం, 100 రోజుల పని దినాలు, ఎందుకు అమలు కావడంలేదు? పట్టణ పేదలకు పని ఎందుకు కల్పించడంలేదు?



పాలక పార్టీల స్వభావం

బయటకు ఎన్ని మాటలు చెప్పినా పాలక వర్గ పార్టీలన్నింటికీ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడం ఇష్టం లేదు. కారణం తమ వెనుక వున్న పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలు. పేదలకు పని హక్కుగా వుండకూడదనేది ప్రపంచీకరణ విధానం. శాశ్వత ఉద్యోగాలను తొలగించే విధానాలను అమలు చేస్తున్న పాలక పార్టీలు గ్రామీణ పేదలకు పని హక్కును చిత్తశుద్ధితో అమలు చేస్తారని ఊహించలేము. అంతేకాదు. ఉపాధి హామీ వల్ల వస్తున్న సామాజిక మార్పులు కూడా వీరు అంగీకరించడంలేదు. అందుకే ఈ చట్టం పట్ల ఈ వర్గాలు అనేక దుష్ప్రచారాలు చేస్తున్నారు. వీరి స్వభావానికి అనుగుణంగా ప్రభుత్వాలు ఈ నిధులను ఇతర పనులకు మళ్లించడం, యంత్రాలతో పనులు చేయించడం, అవినీతిని పరోక్షంగా ప్రోత్సహించడం జరుగుతున్నది.చట్ట ప్రకారం పేదలకు ఉన్న పని హక్కును కోల్పోవడం అంటే వారు జీవించే హక్కును కోల్పోవడమే. దేశ స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకుంటున్న రోజుల్లో గ్రామీణ ప్రజల వినియోగ వ్యయం 8.8 శాతం తగ్గింది. ఆహారంపై చేసే సగటు వ్యయం భారీగా తగ్గిపోయింది. దీని ప్రభావం గర్భిణీ స్త్రీలు, పిల్లలపై స్పష్టంగా వుంది. పేదల్లో 68 శాతం మంది గర్భిణీ స్త్రీలు రక్తహీనతతో, 42 శాతం పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. కార్మిక చట్టాలను, రైతుల హక్కులను కాలరాస్తున్న కేంద్రప్రభుత్వం వ్యవసాయ కూలీల ఉపాధి హామీ చట్టం ఉసురు తీస్తున్నది. కార్మిక, కర్షకుల ఐక్యత ద్వారానే ఈ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించ గలం. అందుకే విశాల ఐక్యత, విశాల ఉద్యమాలే పరిష్కారం.

/ వ్యాసకర్త : సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు/

జనవాక్యం

ఎవరిని మభ్యపెడుతున్నారు?

రాజధాని కాకపోతే విశాఖను రాష్ట్రంగా ప్రకటించాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు అంటున్నారు! మరి మూడు రాజధానుల తీర్మానాన్ని ఎందుకు ఉపసంహరించుకున్నారు? అందుకు మంత్రిగా ధర్మాన కూడా బాధ్యులే కదా? అభివృద్ధి చేసిన హైదరాబాద్ వదులుకున్నాం అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అది మీ నిర్వాకం కాదా? సుదీర్ఘ కాలం మంత్రిగా ఉండి మీరు శ్రీకాకుళం జిల్లాకు ఒక పరిశ్రమనైనా ఎందుకు తీసుకు రాలేకపోయారు? విశాఖ రాజధాని అయితే నరసన్నపేటకు ఒరిగేదేముంది? అమరావతి రాజధానిగా వద్దు అనుకుంటే అక్కడే ఎందుకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నారు? అక్కడే సచివాలయం, హైకోర్టు ఎందుకు కొనసాగుతున్నాయి? కర్నూలు న్యాయ రాజధాని అని కర్నూలు ప్రజలను రెచ్చగొట్టి అభాసుపాలయ్యారు! ఇలాంటి దివాళాకోరు ఆలోచనలతో ప్రాంతీయ కుంపట్లు పెట్టాలనుకుంటే భంగపాటు తప్పదు.

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు

భావప్రకటన స్వేచ్ఛకు విఘాతం

భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇప్పటికే రాష్ట్రంలో అనేక చోట్ల నిరంతరం సెక్షన్ 144, 30 అమలు చేస్తున్నారు. విపక్షాలకు స్వేచ్ఛగా వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునే పరిస్థితి లేదు. తాజా జీవో వల్ల మరిన్ని ఇబ్బందులు ఏర్పడతాయి. రాష్ట్ర ప్రభుత్వం తన జీవోను వెనక్కి తీసుకోవాలి.

ఎం చంద్రశేఖర్, మంగళగిరి

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

యుకెలో రైల్వే ఉద్యోగుల ఐదురోజుల సమ్మె

లండన్ : ఎన్నడూ లేనివిధంగా ద్రవ్యోల్బణం 11 శాతానికి పెరిగిన నేపథ్యంలో వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ రైల్వే కార్మికులు మంగళవారం సమ్మె ప్రారంభించారు. నూతన సంవత్సర సెలవుల అనంతరం తొలి పనిదినమైన మంగళవారం సుమారు 40 వేల మంది కార్మికులు ఐదు రోజుల సమ్మెను ప్రారంభించారు. చర్చలు రావాలని రవాణా కార్యదర్శి మార్క్ హార్పర్ రైల్వే యూనియన్లను కోరారు. యజమానులు, ట్రేడ్ యూనియన్ల మధ్య ఒప్పందం కుదిర్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

అక్రమ ఇసుక తవ్వకాలపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

కడప జిల్లా వల్లూరు మండలం, చెంట్టికుంటపల్లి గ్రామంలో అక్రమంగా జయప్రకాశ్ వెంచర్ ఇసుక తవ్వకాలు చేస్తోందని హైకోర్టులో పిల్ దాఖలైంది. దీని పై చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ సోమయాజులు డివిజన్ బెంచ్ సోమవారం విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి, విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. పూడికతీత పేరుతో జెపి వెంచర్ ఇసుక తవ్వకాలు చేస్తోందని పిటిషనర్ పేర్కొన్నారు.

ప్రజా ప్రతినిధుల భావ ప్రకటన స్వేచ్ఛపై
అదనపు ఆంక్షలు విధించలేం

- సుప్రీం మెజార్టీ తీర్పు
- పార్లమెంటే పరిష్కారం చూపాలి : మైనార్టీ అభిప్రాయం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజా ప్రతినిధుల భావ ప్రకటన స్వేచ్ఛపై అదనపు ఆంక్షలు విధించలేమని, రాజ్యాంగం ప్రకారం వాక్‌స్వాతంత్య్ర హక్కు అందరికీ సమానమని, ఒక మంత్రి చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వానికి ఆపాదించలేమని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు 4:1తో మెజార్టీ తీర్పును వెల్లడించింది. అయితే, నేతల విద్వేష ప్రసంగాల విషయంలో పార్లమెంటే పరిష్కారం చూపాలని, ఆ మేరకు చట్టంచేయాలని మైనార్టీ తీర్పు వెలువరించిన న్యాయమూర్తి పేర్కొన్నారు. 2016లో ఉత్తరప్రదేశ్‌లో ఒక సామూహిక అత్యాచార కేసు నమోదైంది. తన భార్య, కుమార్తెపై జరిగిన ఈ దారుణానికి సంబంధించిన కేసును ఢిల్లీకి బదిలీ చేయాలని ఒక వ్యక్తి పిటిషన్ వేశారు. అప్పట్లో మంత్రిగా ఉన్న అజామ్‌ఖాన్ దీనిని రాజకీయ కుట్రగా పేర్కొన్నారు. మంత్రి వ్యాఖ్యలపై కూడా కేసు నమోదు చేయాలని ఆయన మరో పిటిషన్ వేశారు. దీనిని తొలుత విచారించిన త్రి సభ్య బెంచ్ రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసింది. నవంబర్ 15న ఈ కేసును జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ వి రామసుబ్రమణియన్, జస్టిస్ బివి నాగరత్నలతో కూడిన ధర్మాసనం విచారణ పూర్తి చేసింది. మంగళవారం వెలువరించిన తీర్పులో వాక్ స్వాతంత్య్రం హక్కు రాజ్యాంగం ప్రకారం అందరికీ సమానమేనని మెజార్టీ తీర్పులో ధర్మాసనం పేర్కొంది.

దీనిని జస్టిస్ బిఆర్ గవాయి చదివి వినిపించారు. ప్రజా ప్రతినిధుల వాక్ స్వాతంత్రంపై ఆంక్షలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) నిర్దేశించిన దానికంటే ఎక్కువగా ఉండరాదని పేర్కొన్నారు. వారి ప్రకటనలు ఒక వ్యక్తి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తే వారు వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. పౌర హక్కులకు విరుద్ధంగా మంత్రి చేసిన ప్రకటనలను ప్రభుత్వానికి ఆపాదించలేమని పేర్కొన్నారు. ప్రభుత్వ పదవులను నిర్వహించేవారు సొంతంగా తమపై ఆంక్షలు విధించుకోవాలని సూచించారు.

చట్టాన్ని రూపొందించాలి : జస్టిస్ బివి నాగరత్న

నేతల విద్వేష పూరిత వ్యాఖ్యలపై మార్గదర్శకాలు జారీ చేయలేమని మైనార్టీ తీర్పులో పేర్కొన్న జస్టిస్ బివి నాగరత్న పార్లమెంటు ఈ సమస్యకు పరిష్కారం చూపాలని అన్నారు. పౌరులపై అవమానకరమైన వ్యాఖ్యలు చేయకుండా ప్రజాప్రతినిధులను నిరోధించేందుకు పార్లమెంటు తప్పనిసరిగా చట్టాన్ని రూపొందించాలని అన్నారు. రాజకీయ పార్టీలు తమ సభ్యుల చర్యలు, వ్యాఖ్యలను నియంత్రించడానికి ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. విద్వేషపూరిత వ్యాఖ్యల వల్ల పౌరులు ఇబ్బంది పడితే సివిల్ కోర్టులను ఆశ్రయించవచ్చని, నేతల విద్వేషపూరిత ప్రసంగాలు రాజ్యాంగంలోని సోదర భావం, స్వేచ్ఛ, సమానత్వానికి పెద్ద దెబ్బ అని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మరొక పౌరుడిపై ఉందని పేర్కొన్నారు.

మహిళా క్రీడాకారులకు రక్షణ కల్పించండి

- హర్యానా మంత్రి సందీప్‌సింగ్‌పై చర్య తీసుకోండి
- పిటి ఉషకు జగ్మతీ సంగ్వాన్ లేఖ



రాజ్‌కోట్: హర్యానాకు చెందిన మాజీ వాలీబాల్ క్రీడాకారిణి, భీమ్ అవార్డు గ్రహీత జగ్మతీ సంగ్వాన్ భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐఒఎ) అధ్యక్షురాలు పిటి ఉషకు మంగళవారం లేఖ రాశారు. ఆ లేఖలో జూనియర్ మహిళా అథ్లెట్ కోచ్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన హర్యానా క్రీడల మంత్రి, బిజెపి నేత సందీప్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఐఒఎ అధ్యక్షపీఠాన్ని అధిరోహించిన తొలి మహిళగా రికార్డు నెలకొల్పిన పిటి ఉషను అభినందిస్తూ.. హర్యానాలోని సాధారణ కుటుంబాలకు చెందిన బాలికల అకడమిక్ కెరీర్ నాశనం కాకుండా చూడాల్సిన బాధ్యతను ఆమె గుర్తుచేశారు. కార్యాలయాలు, క్రీడా కార్యకలాపాల స్థలాలతోపాటు అన్ని పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల వ్యతిరేక కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. అలా చేస్తే మహిళా క్రీడాకారులు, ఉద్యోగులు ఎలాంటి భయం లేకుండా తమ ఫిర్యాదుల నమోదుకు ముందుకువస్తారని తెలిపారు. 1982 ఆసియా క్రీడల్లో పిటి ఉషతో కలిసి భారత బృందంలో తాను ప్రాతినిధ్యం వహించిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. హర్యానా రాష్ట్ర క్రీడల మంత్రి, బిజెపి నేత సందీప్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో మంత్రి పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

భారత్‌లో ప్రవేశం లేని ప్రవాస భారతీయుడికి ప్రవాస భారతీయ అవార్డు !

న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన కోటీశ్వరుడు, 2020-21లో రైతుల నిరసనలకు మద్దతు తెలియజేసినందుకు భారత్‌లోకి ప్రవేశించనీయకుండా అడ్డుకున్న ప్రవాస భారతీయుడు దర్శన్ సింగ్ ధలివాల్‌కు ప్రవాసి భారతీయ సమ్మాన్ అవార్డు (పిబిఎస్ఎ) లభించింది. విదేశాల్లో వున్న భారతీయులకు ఇచ్చే అత్యున్నత ప్రభుత్వ గౌరవం ఇది. మొత్తంగా 27మందికి ఈ అవార్డులు ఇచ్చారు. వీరిలో ఇజ్రాయిల్‌లో రెస్టారెంట్ యజమాని రీనా పుష్కర్ణ, ఫెడెక్స్ ఛైర్మన్ రాజ్ సుబ్రమణియం వున్నారు. వ్యాపార వాణిజ్య వర్గాల సంక్షేమం కేటగిరీలో ధలివాల్‌ను ఎంపిక చేశారు. ఈ నెల 8-10 తేదీల్లో ఇండోర్‌లో జరిగే పిబిడి సదస్సులో ఈ అవార్డును అందజేయనున్నారు.

ఒడిషాలో మరో రష్యన్ అనుమానాస్పద మృతి

పారాదీప్ (ఒడిషా) : మరో రష్యన్ జాతీయుడు ఒడిషాలో మరణించి వుండగా, మంగళవారం కనుగొన్నారు. 15రోజుల వ్యవధిలోనే ఇది మూడో సంఘటన అని పోలీసులు తెలిపారు. మిలకోవ్ సెర్గి(51) గా గుర్తించిన ఆ రష్యన్‌ను జగత్‌సింగ్‌పూర్ జిల్లాలోని పారాదీప్ ఓడరేవులో లంగరు వేసి వున్న నౌకలో చనిపోయి వుండగా కనుగొన్నారు. ఆ నౌక ఎం.బి.అల్దనా చీఫ్ ఇంజనీర్‌గా ఆయన పనిచేస్తున్నారు. బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ ఓడరేవు నుంచి పారాదీప్ మీదుగా ముంబయికి ఆ నౌక వెళుతోంది. తెల్లవారు జామున 4.30గంటలకు నౌకలో తన చాంబర్‌లో చనిపోయి వుండగా చూశారు. మరణానికి కారణమేంటో పోలీసులు నిర్ధారించలేకపోయారు. రష్యన్ ఇంజనీర్ మృతిని పారాదీప్ పోర్ట్ ట్రస్ట్ ఛైర్మన్ పి.ఎల్. హరనంద్ ధ్రువీకరించారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. డిసెంబరు రెండో వారం నుండి ఇప్పటివరకు దక్షిణ ఒడిషాలోని రాయగడ పట్టణంలో అనుమానాస్పద పరిస్థితుల్లో పార్లమెంట్ సభ్యునితో సహా ఇద్దరు రష్యన్ పర్యాటకులు చనిపోయి వుండగా కనుగొన్నారు. డిసెంబరు 24న తాను వుంటున్న హోటల్‌లోని మూడవ అంతస్తు నుండి పడిపోయి రష్యన్ ఎంపి పావెల్ అనతొవ్ (65) మరణించారు. ఆయన స్నేహితుడు వ్లాదిమిర్ బిదెనొవ్ (61) అంతకు రెండు రోజుల ముందు తన గదిలో చనిపోయి వుండగా కనుగొన్నారు. రెండు కేసుల్లోనూ ఒడిషా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుండి 72 గంటల పాటు
విద్యుత్ కంపెనీల ఉద్యోగుల సమ్మె

- సిఐటియు మద్దతు

ముంబయి : విద్యుత్ కంపెనీల ప్రైవేటీకరణకు నిరసనగా బుధవారం నుంచి 72గంటల పాటు సమ్మె చేస్తామని మహారాష్ట్రలోని మూడు ప్రభుత్వ విద్యుత్ కంపెనీల యూనియన్లు హెచ్చరించాయి. 30కి పైగా యూనియన్లకు చెందిన డ్రైవర్లు, వైర్‌మెన్‌లు, ఇంజనీర్లు, ఇతర ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొంటారని విద్యుత్ కంపెనీ యూనియన్ల కార్యాచరణ కమిటీ ప్రధాన కార్యదర్శి కృషన్ భోయిర్ తెలిపారు. మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (మహా వితరణ్), మహారాష్ట్ర రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్ (మహాపరేషన్), మహారాష్ట్ర రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్ (మహానిర్మితి)లు ప్రభుత్వ విద్యుత్ కంపెనీలు. ఈ కంపెనీల ఉద్యోగులు గత మూడు వారాలుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. సోమవారం థానే కలెక్టర్ కార్యాలయం వెలుపల 15వేల మందికి పైగా ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. దాదాపు 86వేల మంది ఉద్యోగులు, అధికారులు, ఇంజనీర్లు, వీరితోపాటు 42వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, భద్రతా గార్డులు బుధవారం నుండి 72గంటల సమ్మెకు సమాయత్తమవుతున్నారని భోయిర్ తెలిపారు.

సిఐటియు సంపూర్ణ మద్దతు

మహారాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన ఈ సమ్మెకు మద్దతు పలుకుతున్నామని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అదానీ గ్రూప్ ప్రవేశపెట్టిన హేయమైన పన్నాగాలకు మహారాష్ట్ర విద్యుత్ బోర్డు బలవుతోందని, దాంతో సమ్మెకు వెళ్లటం తప్ప కార్మికులకు మరో మార్గం లేదని పేర్కొన్నారు. మహారాష్ట్ర విద్యుత్‌రంగ వ్యాపారంలో సగం వాటాను పొందాలనే లక్ష్యంతో టొరంటో పవర్, టాటా పవర్ అడుగులు వేస్తున్నాయి. మొత్తంగా విద్యుత్‌రంగంపై అన్ని వైపుల నుంచి దాడులు మొదలయ్యాయి. ప్రయివేటీకరణ కొనసాగితే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 2.8 కోట్ల మంది విద్యుత్ వినియోగదార్లు అదానీ కంపెనీ సేవలు పొందాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

మహిళల భాగస్వామ్యంతోనే
విజ్ఞానరంగంలో సాధికారత : ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : మహిళల భాగస్వామ్యంతో విజ్ఞాన రంగం సాధికారతను సాధిస్తుందని ప్రధాని మోడీ అన్నారు. వైజ్ఞానిక పరిశోధనల్లో మహిళల ప్రమేయం, ప్రాముఖ్యత పెరగడమే సమాజ, శాస్త్ర పురోగతికి ప్రతిబింబమని అన్నారు. 108వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ (ఐఎస్‌సి) సమావేశంలో మోడీ మంగళవారం వర్చువల్‌గా పాల్గొన్నారు. సైన్స్, రీసెర్చ్‌లకు నూతన ఉత్తేజం ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రయోగశాల నుంచి క్షేత్రస్థాయికి తీసుకువెళ్లినపుడే ఫలవంతమవుతాయని అన్నారు. ఈ రోజు భారత్ స్టార్టప్‌లలో మొదటి మూడు దేశాల్లో ఒకటని ప్రశంసించారు. 2015లో గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 81వ స్థానంలో ఉన్న భారత్... 2022లో 40 స్థానానికి ఎగబాకిందని గుర్తుచేశారు. దేశాన్ని ఆత్మనిర్భర భారత్‌గా మార్చడంలో సైన్స్ ప్రాముఖ్యత ఎంతో ఉందని అన్నారు. భారత దేశం వైజ్ఞానిక రంగంలో అగ్రదేశాలలో ఒకటిగా దూసుకుపోతుందనీ, రాబోయే 25 ఏళ్లలో భారత్ ఏ స్థానంలో ఉంటుందో అంచనావేయలేమని అన్నారు. దేశానికి సేవ చేయాలనే సంకల్పంతోపాటు సైన్స్‌పై ఉన్న ఆసక్తిని కూడా జతచేస్తే... అద్భుతమైన ఫలితాలు వస్తాయని సూచించారు.

మత మార్పిడులన్నీ చట్టవిరుద్ధం కాదు

- హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వలేం
- సుప్రీం కోర్టు ధర్మాసనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మత మార్పిడులన్నీ చట్ట విరుద్ధం కాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మత మార్పిడి సమయంలో తప్పనిసరిగా జిల్లా మేజిస్ట్రేట్ (డిఎం) ముందు డిక్లరేషన్ చేయాలంటూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన మత స్వేచ్ఛ చట్టం అవసరాన్ని కొట్టివేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తీర్పుపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవి కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. "అన్ని మత మార్పిడులు చట్టవిరుద్ధమని చెప్పలేం. నోటీసు జారీ చేయడంతోపాటు మధ్యంతర ఉపశమనం ఇస్తాం. ఫిబ్రవరి 7న విచారిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా కౌంటర్ ఉంటే దాఖలు చేయాలి' అని ధర్మాసనం పేర్కొంది. మధ్యప్రదేశ్ రాష్ట్రం తరపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ "వివాహం లేదా మత మార్పిడిపై ఎలాంటి నిషేధం లేదు. జిల్లా మేజిస్ట్రేట్‌కు మాత్రమే సమాచారం ఇవ్వాలి. హైకోర్టు తీర్పుపై స్టే విధించాలి" అని కోరారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ, దీనిని తాము స్వీకరించలేమని, రాష్ట్రం వద్ద ఏదైనా కౌంటర్ ఉంటే తదుపరి విచారణ తేదీన సమర్పించవచ్చని పేర్కొంది. ఈ కేసు తదుపరి విచారణ ఫిబ్రవరి 7కి వాయిదా వేసింది. చట్టంలోని సెక్షన్ 10 (మత మార్పిడికి ముందు ప్రకటన)ను ఉల్లంఘించే ఏ వ్యక్తిపైనా బలవంతపు చర్య తీసుకోవద్దని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ ప్రకాష్ చంద్ర గుప్తాలతో కూడిన ధర్మాసనం నవంబర్ 14న ఇచ్చిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. "పరివర్తనను కోరుకునే పౌరుడు జిల్లా మేజిస్ట్రేట్‌కు ఈ విషయంలో డిక్లరేషన్ ఇవ్వడాన్ని సెక్షన్ 10 తప్పనిసరి చేస్తుంది. ఇది మా అభిప్రాయం ప్రకారం రాజ్యాంగ విరుద్ధం. వయోజన పౌరులు వారి స్వంత ఇష్టానుసారం వివాహం చేసుకుంటే, చట్టంలోని సెక్షన్ 10ని ఉల్లంఘించినందుకు బలవంతపు చర్య తీసుకోకూడదు" అని హైకోర్టు పేర్కొంది. ఈ చట్టం రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారిస్తున్న సమయంలో హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

రాహుల్ ఒక పోరాట యోధుడు!

- జోడో యాత్రలో ప్రియాంక గాంధీ

ఘజియాబాద్ : తన సోదరుడు రాహుల్ గాంధీ ఒక పోరాట యోధుడని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా వ్యాఖ్యానించారు. రాహుల్ పేరు ప్రతిష్టలను నాశనం చేసేందుకు వేలాది కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్న ప్రభుత్వ బలానికి భయపడడని అన్నారు. ఢిల్లీ నుండి ఉత్తరప్రదేశ్‌లోకి ప్రవేశించే లోని సరిహద్దు వద్ద భారత్ జోడో యాత్రకు, రాహుల్ గాంధీకి ఆమె స్వాగతం పలికారు. అదానీ, అంబానీ వంటి బడా పారిశ్రామికవేత్తలు రాజకీయ నేతలను, పిఎస్‌యులను, మీడియాను కొనవచ్చు కానీ, వారెన్నటికీ నా సోదరుడిని కొనలేరని ప్రియాంక అన్నారు. ఈ ప్రభుత్వం ఎంతలా ఒత్తిడి తెచ్చినా, కోట్లాది రూపాయలను ఖర్చు పెట్టి తప్పుడు ప్రచారం చేసినా, ఆయన సత్య పంథా నుండి వైదొలగక ప్రయాణం సాగిస్తూనే వున్నారని ఆమె వ్యాఖ్యానించారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఐదుగురికి బెయిల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో రౌజ్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు ఐదుగురు నిందితులకు బెయిలు మంజూరు చేసింది. సిబిఐ దాఖలు చేసిన ఛార్జిషీటుపై మంగళవారం జస్టిస్ ఎంకె నాగ్‌పాల్ విచారించారు. అనంతరం ఎక్సైజ్ శాఖ మాజీ అధికారులు కుల్దీప్ సింగ్, నరేందర్ సింగ్, ముత్తా గౌతమ్, అరుణ్ పిళ్ళై, సమీర్ మహేంద్రులకు రూ. 50 వేలు చొప్పున వ్యక్తిగత పూచీకత్తుతో మధ్యంతర బెయిలు మంజూరు చేశారు. నిందితుల రెగ్యులర్ బెయిలుపై కౌంటరు దాఖలు చేయాలని సిబిఐని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణ ఈనెల 24కు వాయిదా వేసింది.

హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డి లేఖలపై నివేదిక ఇవ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

గృహ నిర్మాణ పథకానికి రావాల్సిన రూ.358 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరుతూ హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డి రాసిన లేఖలపై ఏం చర్యలు తీసుకున్నదీ వివరించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీనిపై నివేదిక సమర్పించాలని గృహ నిర్మాణశాఖ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులను కోరింది. ఈ మేరకు జస్టిస్ బి.దేవానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను ఈ నెల 18కి వాయిదా వేశారు.

త్రిసభ్య ధర్మాసనానికి రాజధానిలో ఇతరులకు స్థలాల కేసు

ప్రజాశక్తి-అమరావతి

అమరావతిలోని రాజధాని ఏరియాలో ఇతర ప్రాంతాల వాళ్లకు ఇళ్ల స్థలాల కేటాయింపులకు అనుగుణంగా చట్ట సవరణ చేసిన సిఆర్‌డిఎ నిర్ణయాన్ని సవాల్ చేసిన అన్ని కేసుల్ని విచారణ చేస్తామని హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ప్రకటించింది. కొన్ని కేసులు త్రిసభ్య ధర్మాసనం వద్ద, మరికొన్ని కేసులు ద్విసభ్య ధర్మాసనం వద్ద ఉన్నాయి. అన్నింటినీ తాము విచారణ చేస్తామని చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం ప్రకటించింది. ఇదే విధంగా రాజధానిని 6 నెలల్లోగా అభివృద్ధి చేయాలన్న ఉత్తర్వులను కావాలని అమలు చేయకుండా కోర్టుధిక్కార చర్యలకు పాల్పడ్డారంటూ సిఎం, మంత్రులు, అధికారులపై దాఖలైన కేసులను కూడా కలిపి ఫిబ్రవరి 27న విచారణ చేస్తామని వెల్లడించింది.

టిడిపి నేతలకు ముందస్తు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

ఇటీవల మాచర్లలో జరిగిన అల్లర్ల కేసులో నిందితులుగా ఉన్న టిడిపి నేతలకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. టిడిపి మాచర్ల ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి సహా 23 మందికి ముందస్తు బెయిల్ వచ్చింది. ఆ కేసులో 7వ నిందితుడు కళ్లం రమణారెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరుకు నిరాకరించింది. ఈ మేరకు జస్టిస్ కె.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. గత నెల 17న టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య జరిగిన అల్లర్లలో పలువురు గాయపడ్డారు. టిడిపి నేతలు, కార్యకర్తలపై పోలీసులు నమోదు చేసి కేసుల్లో 24 మంది ముందస్తు బెయిల్ కావాలని హైకోర్టుకు వచ్చారు. ఒకరికి మినహా 23 మందికి ముందస్తు బెయిల్ మంజూరైంది.

పోలీసుల అనుమతితో సభలు : కెఎ పాల్ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

పోలీసుల అనుమతి ఉంటేనే రాజకీయపార్టీలు బహిరంగ సభలు, రోడ్‌షోల నిర్వహణకు అనుమతించేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కెఎ పాల్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర హోం శాఖ కార్యదర్శులు, డిజిపి, కందుకూరు ఎస్‌హెచ్‌వో, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యదర్శిని ప్రతివాదులుగా పేర్కొన్నారు.

ఏం కేసులున్నాయో చెప్పండి : రఘురామరాజు రిట్

ప్రజాశక్తి-అమరావతి

తనపై పలు పోలీస్ స్టేషన్లల్లో ఉన్న కేసుల వివరాలు అందజేసేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ నర్సాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు హైకోర్టులో రిట్‌దాఖలు చేశారు. సంక్రాంతికి భీమవరం వెళ్లాలనుకుంటున్నానని, పోలీసులు తనపై ఏం కేసులున్నాయో చెప్పకపోవడం వల్ల అరెస్టు చేసే అవకాశాలున్నాయని రిట్‌లో పేర్కొన్నారు.

అదానీకి అనుచిత లబ్ధి

(మొదటి పేజీ తరువాయి)

స్టోరేజీ పథకాలను ఏర్పాటు చేయడానికి ఆదానీ గ్రూపు నేతృత్వంలోని జాయింట్ వెంచర్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంఒయులపై సంతకాలు చేసింది. ఇది పీసా, షెడ్యూల్డ్ ప్రాంతాలు, ఇతర అటవీ ప్రాంతాలకు వర్తించే ఎఫ్ఆర్ఎ చట్టాల కింద ఆదివాసీ గ్రామసభల ప్రాధాన్యతను ఉల్లంఘించడం కాదా? అటువంటి ప్రాజెక్టులు ప్రాథమికంగా చట్టవిరుద్ధం మాత్రమే కాక, స్థానిక ఆదివాసీ సంస్కృతికి విఘాతం కలిగిస్తాయి. ఆ ప్రాజెక్టులు గిరిజన ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రతికూల ప్రభావాన్నీ చూపుతాయి. ఆదానీ గ్రూపునకు కేటాయించిన పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు జాతీయ జల-విద్యుత్తు విద్యుత్తు విధాలా ఉల్లంఘించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదానీ గ్రూపునకు రాయితీలు కల్పించే తీరు ప్రజాప్రయోజనాలను ఫణంగా పెట్టి రాష్ట్రం దివాళా తీయడానికే తోడ్పడుతుంది మినహా రాష్ట్ర ప్రజలకు ఏ మాత్రమూ ప్రయోజనం ఉండదు.

గంగవరం పోర్టులోనూ వ్యూహాత్మక ఈక్విటీ వాటా అమ్మేయలేదా?

ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గంగవరం పోర్టులో తన వ్యూహాత్మక 10.5 శాతం ఈక్విటీ వాటాను అదానీ గ్రూప్‌నకు విక్రయించింది. ఇది కూడా ప్రభుత్వ ఖజానాకు నష్టం చేసే విధానం. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించడానికి కేంద్రం తీసుకున్న తెలివితక్కువ చర్యను అనుసరించి తక్కువ ధరకు కొనుగోలు చేయాలనే దాని వాదనను బలపరిచేందుకు కూడా ఇది అదానీ గ్రూపునకు మార్గం సుగమం చేసినట్టు కాదా? ఓడరేవును పూర్తిగా ప్రయివేటీకరించే అత్యంత అభ్యంతరకర చర్యలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చేతులు కలిపింది. ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించడం వల్ల ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు సెంటిమెంట్ ప్రభావం ఎక్కువగా ఉందని పరిగణలోకి తీసుకుంటే కేంద్రంతో కుమ్మక్కైన రాష్ట్రం ఉద్దేశపూర్వకంగా ఎపిలోని ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా నడుచుకుందన్నది పైచర్య సూచిస్తోంది. కృష్ణపట్నం ఓడరేవుకు రాష్ట్ర ప్రభుత్వం యజమాని. దానిలో వాటాను ప్రభుత్వం కలిగి ఉన్నప్పటికీ దీన్ని పట్టించుకోకుండా ఆ పోర్టులో వంద శాతం వాటాను అదానీ పొందేలా రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. అదే సమయంలో ఎంతో నైపుణ్యం, మరెంతో సామర్థ్యం, అనుభవం కలిగిన ప్రభుత్వ నిర్వహణలోని దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ నిర్వహణను కూడా రాష్ట్ర ప్రభుత్వం అదానీపరం చేస్తుందన్న పుకార్ల సంగతి తెలిసిందే. రాష్ట్రానికి చెందిన థర్మల్ పవర్ ప్లాంట్ వంటి విలువైన ఆస్తులను వెండిపళ్లెంలో అప్పగించి ఆ వర్గానికి అదనపు అనుచిత ప్రయోజనాలను కల్పించేందుకు రాష్ట్రం తన అసమ్మతిని వ్యక్తం చేయడానికి బదులు లొంగిపోవడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ అదానీ గ్రూపునకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలపై న్యాయ కమీషన్ విచారణ చేయాలని భావిస్తున్నాను. ఎందుకంటే ఈ నిర్ణయాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందా? ప్రయివేట్ ఏజెన్సీలకా? ప్రజల దృష్టిలో తన విశ్వసనీయతను నెలకొల్పడానికి రాష్ట్ర ప్రభుత్వం పైనపేర్కొన్న వాటికి అంగీకరిస్తుందని నేను ఆశిస్తున్నాను.

రైతుకు బరువైన ఎరువు

(మొదటి పేజీ తరువాయి)

టన్నులు, ఈ సంవత్సరం 50 వేల టన్నులు. ఎస్ఎస్‌పి అమ్మకాలు ముందటేడు 95 వేల టన్నులు, నిరుడు 98 వేల టన్నులు కాగా ఈ తడవ 86 వేల టన్నులు. ఇదిలా ఉండగా, కేంద్రం సబ్సిడీ ఇచ్చి ధరలు నిర్ణయించే యూరియా బస్తా రూ.268 కే లభిస్తుండటంతో యూరియా సేల్స్ ముందటేడు కంటే తగ్గినా నిరుటి కంటే ఈ ఏట స్వల్పంగా పెరిగాయి. డిఎపి బస్తాపై సబ్సిడీ పోను నిరుడు రూ.1,200 కి లభించింది. ఈ తడవ రూ.1,350 అయింది. కాంప్లెక్స్ ధరలతో పోల్చితే డిఎపి రేటు తక్కువ కావడంతో ఆ ఎరువు అమ్మకాలు పెరిగాయి.

ఇవి కూడా...

ఎరువుల వినియోగం తగ్గడానికి సాగు విస్తీర్ణం తగ్గడం ఒక ముఖ్య కారణంగా చెబుతున్నా మూడేళ్లలో పెద్దగా తేడా ఏమీ లేదు. 2020 ఖరీఫ్‌లో 91 లక్షల ఎకరాలు, 2021 ఖరీఫ్‌లో 88 లక్షల ఎకరాలు, 2022 ఖరీఫ్‌లో 87 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. కానీ ఎరువుల వినియోగం సాగు విస్తీర్ణంతో సంబంధం లేకుండా బాగా తగ్గాయి. ముందటేడు అన్ని రసాయన ఎరువులూ కలుపుకొని 18.80 లక్షల టన్నులు, నిరుడు 15.57 లక్షల టన్నులు, ఈ మారు 15.53 లక్షల టన్నులకు విక్రయాలు పడిపోయాయి. రైతులు కోరుకున్న ఎరువులు అదనుకు దొరకపోవడం, సరఫరాలో ఇబ్బందులు, కృత్రిమ కొరత కూడా ఎరువుల వినియోగం తగ్గుదలకు కొంత వరకు కారణమని చెబుతున్నారు.



మీకోసం

బియ్యం పురుగు పట్టకుండా ఉండాలంటే అందులో నాలుగు ఎండు మిరపకాయలు వేసి ఉంచాలి.

జీవన సౌరభం

మన లోపాలను మనం గ్రహించడం అన్నింటికన్నా గొప్ప చదువు.

అంధుల లిపి .. బ్రెయిలీ

నేస్తాలూ, ఈ రోజు లూయిా బ్రెయిల్ పుట్టినరోజు. మరి ఆయన గురించి తెలుసుకుందామా!



పారిస్‌లో క్రూవే అనే గ్రామంలో మోనిక్ బ్రెయిలీ, సైమన్ రెనె బ్రెయిలీలకు 1809లో జనవరి 4న లూయిా జన్మించారు. మూడేళ్ల వయసులో ఉండగా, ఓ ప్రమాదంలో రెండు కళ్లూ కోల్పోయాడు. హవే అనే వ్యక్తి 1784లో అంధులకు ప్రత్యేక పాఠశాలను స్థాపించాడు. కాగితంపై ఉబ్బెత్తు అక్షరాలను రూపొందించాడు. దీన్ని లైన్‌టైప్ అనేవారు. బ్రెయిలీ ఈ పాఠశాల్లో చేరాడు. పాఠాలను చాలా శ్రద్ధగా చదివేవాడు. 15 ఏటే తాను చదివిన పాఠశాల్లోనే ఉపాధ్యాయుడుగా నియమితుడయ్యాడు.

అంధులకు చదువు చెప్పాలంటే వారికి పుస్తకాలు కావాలి. కంటితో వారు చూడలేరు. స్పర్శ ద్వారా తప్ప మరో మార్గంలో వారు చదువుకోలేరు. అందుచేత ఎత్తుగా ఉబ్బివుండే విధంగా అక్షరాలు ఉన్న పుస్తకాలు కావాలి. చెక్కమీద, పుస్తకాల మీద ఎత్తుగా ఉబ్బివుండే అక్షరాలను రూపొందించేందుకు బ్రెయిలీ కష్టపడ్డారు.

చార్లెస్ బార్బియర్ అనే సైనికాధికారి, సైనికులు రాత్రిపూట సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉపయోగించే 12 ఉబ్బెత్తు చుక్కల ప్రత్యేక లిపిని తయారుచేశాడు. దీన్ని ఆధారంగా చేసుకుని బ్రెయిల్ తన నూతన పద్ధతి సిద్ధాంతీకరించాడు. ఐదేళ్ల పాటు పరిశోధన చేసి ఆరు చుక్కల లిపిని రూపొందించాడు. ఆరు పాయింట్లు వివిధ రకాలుగా వాడి మొత్తం 26 ఇంగ్లీషు అక్షరాలూ పలికేటట్లు చేశాడు. మొత్తం భాషకు 250 గుర్తులు రూపొందించాడు. ఈ లిపినే ప్రపంచదేశాల వారూ ఉపయోగిస్తున్నారు. బ్రెయిలీ లిపి కుడి నుంచి ఎడమకు రాస్తారు. బ్రెయిలీలో టైపురైటర్లు కూడా రూపొందించారు. అంధులకు వెలుగు చూపించిన బ్రెయిలీ 1852లో క్షయ వ్యాధికి గురై మరణించారు.

నేను గీసిన బొమ్మ






- టి. నాగేంద్ర,
7వ తరగతి,
జడ్. పి. ఉన్నతపాఠశాల,
మైదుకూరు, కడప జిల్లా.

జత చేయండి

పిల్లలూ! ఇక్కడ కొన్ని జీవులు ఉన్నాయి. ఎదురుగా వాటి నివాసాలు ఉన్నాయి. దేనికి ఏది సరైనదో జతచేయండి.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రశ్నించడంతోనే మార్పు సాధ్యం



'ఇరవై ఏళ్ల క్రితం యూనివర్శిటీలో చదువుకునేటప్పుడు భావి భారతం గురించి ఎన్నో కలలు కన్నాం. దేశంలో పెద్ద ఎత్తున మార్పులు వస్తాయని, ఆర్థికంగా వృద్ధి లేకపోయినా సాంస్కృతికంగా పెద్ద మార్పు చూస్తామని అనుకున్నాం. ప్రజల ఆలోచనా ధోరణి చాలా మారుతుందని, ఉన్నతమైన సమాజం చూస్తామని భావించాం. కాని ఇప్పటి పరిస్థితి 20 ఏళ్ల ముందుకు వచ్చినట్లు లేదు.. 50 ఏళ్లు వెనక్కి వెళ్లినట్లు ఉంది' అంటున్నారు హైద్రాబాద్ నివాసి రాణి నిడదవోలు. ఆమె ఓ సాధారణ గృహిణి. కాని సమాజం పట్ల అవగాహన ఉన్న వ్యక్తి. ఉన్నత విద్యావంతురాలైనా ఇంటిపట్టునే ఉంటూ.. భర్తకు, బిడ్డకు వండిపెట్టడమే లోకమనుకునే సాధారణ ఇల్లాలిలో ఇంతటి ఆవేదనకు గల కారణమేంటి?

గుప్పెడు మెతుకుల కోసం, గుక్కెడు నీళ్ల కోసం లక్షలాదిమంది తల్లడిల్లడం ఆమె కళ్లారా చూసింది. గిన్నెలో కాసింత అన్నం వెయ్యమని పిల్లలు, పెద్దలు ఒక్కసారిగా ఎగబడడం చూసి దు:ఖంతో నోటమాట రాని పరిస్థితి ఎదుర్కొంది. పురిటినొప్పులతో తల్లడిల్లే అభాగ్యురాలిని ఆస్పత్రిలో చేర్చుకోని దారుణానికి సాక్ష్యంగా నిలిచింది. ఆకలితో అలమటిస్తున్న ముక్కుపచ్చలారని పసిబిడ్డలు, బిడ్డల ఆకలి తీరే మార్గం కనపడక అయోమయంగా చూస్తున్న పెద్దల దైన్యం కళ్లముందు కదలాడుతుంటే.. 'నేను కలగన్న భారతం ఇది కాద'ని కలత చెందింది.

రెండేళ్ల కోవిడ్ కల్లోలంలో రాణి అనుభవించిన హృదయ విదారకర అనుభవాలు ఇవి. లాక్‌డౌన్‌తో దేశం స్తంభించిన వేళ ఎంతోమంది అభాగ్యులకు అన్నదాత అయింది. బ్రిడ్జిలపై, హైవేలపై, రోడ్డుపై నడిచివెళుతున్న వలసజీవులను ఆదుకున్న ఎందరిలోనో రాణి ఒకరు. అయితే లాక్‌డౌన్‌కు రెండు రోజుల ముందు వరకు ఆమె తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అంతుపట్టని వ్యాధితో చికిత్స లేకుండా పరీక్షలతోనే రోజులు గడిచిపోతున్నాయి. సరైన వైద్యం అందక రెండు నిమిషాలు కూడా నిలబడలేని నిస్సత్తువకు చేరుకున్నారు. అప్పుడే దేశంలో కోవిడ్ ప్రవేశించింది. లాక్‌డౌన్ మొదలైంది.

రాజమండ్రిలో పుట్టిపెరిగిన రాణి భర్త ప్రభుత్వోద్యోగి. ఉద్యోగరీత్యా భర్తతో పాటు పలు రాష్ట్రాలు తిరగడం, పాప పుట్టాక తన ఆలనాపాలనా చూసుకోవడమే లోకంగా జీవించారు. 'ఇల్లు, భర్త, బిడ్డ యోగక్షేమాలు పట్టించుకుంటూ ఎంఫిల్ చేయాలన్న కల కలగానే ఉండిపోయింది. అదే నా జీవితంలో పెద్ద వెలితిగా ఉండిపోయింది. ప్రస్తుతం హైద్రాబాద్‌లో ఉంటున్నాం. పాప మెడిసిన్ చదువుతోంది. జీవితం ఇలా సాఫీగా సాగిపోతున్న వేళ నా ఆరోగ్యం పూర్తిగా పాడైపోయింది. వ్యాధి ఏంటో వైద్యులు అంచనా వేయలేకపోయారు. రకరకాల పరీక్షలు చేసేవారు. రోజులు గడుస్తున్న కొద్దీ మంచానికే పరిమితమైపోయాను. ఈ లోపు లాక్‌డౌన్ పడింది. ఇంట్లోనే ఉండిపోయిన నాకు స్నేహితుల ద్వారా మా పక్కనే పనుల్లేక ఆకలితో అలమటిస్తున్న భవన నిర్మాణరంగ కార్మికుల గురించి తెలిసింది. అక్కడ పెద్దలతో పాటు పిల్లలు కూడా ఉన్నారని తెలిసి ఒక్క క్షణం కూడా ఇంట్లో ఉండలేకపోయాను. లేని సత్తువను కూడదీసుకుని నా స్నేహితురాలు జర్నలిస్టు వనజ సహాయంతో మరికొంతమంది దాతల సాయంతో వారికి కావాల్సినవి ఇచ్చి వచ్చాం.

'ఆ రోజు నుండే నా జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది' అంటున్న రాణి లాక్‌డౌన్ కాలంలో ఉదయం నుండి సాయంత్రం వరకు వలస కార్మికులకు ఆహార పదార్థాలు అందించడం, బట్టలు, చెప్పులు, నిత్యవసరాలు పంచిపెట్టడం, సొంతూళ్లకు పంపించడంలోనే రోజంతా గడిపేవారు. తీరికలేకుండా గడుపుతున్న ఆమెను చూసి 'అప్పటివరకు అనారోగ్యంతో కదల్లేని వ్యక్తి ఇంత ఉత్సాహంగా ఎక్కడెక్కడికో ఎలా వెళ్తోంది' అని తెలిసినవారంతా ఆశ్చర్యపోయేవారు.

కరోనా మొదటి దశలో ప్రత్యక్షంగా సాయం అందించడంలో ముందున్న రాణి రెండో దశలో కరోనాకు గురయ్యారు. తన స్నేహితుల్లో చాలామందికి కరోనా సోకింది. ఒకపక్క భయం వెంటాడుతున్నా ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా తనవంతు సాయమందించారు. సోషల్‌మీడియా వేదికగా స్నేహితుల సహకారంతో ఎక్కడెక్కడో ఉన్న వలసజీవులను సొంతూళ్లకు చేర్చడం, ఆస్పత్రిలో ఆక్సిజన్ సిలిండర్లు, మందులు, పడకలు సమకూర్చడంలో ముందున్నారు. తమిళనాడు, ముంబయి వంటి మహానగరాల్లో కూడా స్నేహితుల సహకారంతో సాయం చేశారు. 'జార్ఖండ్ నుండి తమిళనాడుకు వలస వచ్చిన 40 మంది



అమ్మాయిలు వారం రోజులుగా రైల్వేస్టేషనులో పడిగాపులు కాస్తున్నారు. వారి దగ్గర డబ్బులు లేవు. సాయం అందించండి అంటూ ఒకరోజు సమాచారం వచ్చింది. సోషల్‌మీడియా ద్వారా వచ్చిన ఆ సందేశం నన్ను ఒకపట్టాన ఉండనీయలేదు. ఎలాగైనా వారిని పంపించాలనుకున్నాను. నా భర్త స్నేహితుల సహకారంతో రైల్వే ఉన్నతోద్యోగులతో మాట్లాడి



వారందరి కోసం ప్రత్యేక బోగీ ఏర్పాటుచేశాను. రైలు ఎక్కుతున్న ఆ అమ్మాయిలంతా కృతజ్ఞతలు చెబుతూ నాకు మెసేజ్‌లు చేశారు. అప్పుడు చాలా సంతోషమేసింది' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని గుర్తుచేసుకున్నారు.

కరోనా సమయంలో ఆమె చూసిన పరిస్థితులు ఎంతోమందికి అనుభవమే. కాని అవన్నీ విపత్తు వల్ల సంభవించిన దారుణాలుగా చాలామంది భావించారు. కాని రాణి మాటల్లో చెప్పాలంటే 'వ్యవస్థలో చాలా మార్పు రావాలి. పాలకులు చేసే పొరబాట్లు, బాధ్యతారాహిత్యం ఎన్నో విపరీతాలకు దారితీస్తుంది. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ లాక్‌డౌన్ కాలంలో వలసకార్మికులు అనుభవించిన వెతలు. లాక్‌డౌన్ లేదు పరిస్థితి అంతా మామూలు అయిపోయిందనుకోవడానికి లేదు. ఇప్పటికీ ఆ ప్రభావం ప్రజల మీద ఉంది. ఎంతోమంది పనుల్లేక పస్తులు పడుకుంటున్నారు. చిన్న చిన్న దుకాణాలు మూతబడ్డాయి. చిరు వ్యాపారులు ఎంతోమంది దివాళతీశారు. లాక్‌డౌన్ కాలంలో ఎంతోమంది దాతలు లక్షల మందికి సాయం చేశారు. కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అదంతా తాత్కాలికం. పేదల బతుకులు బాగుపడాలంటే శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి' అంటున్నారు. వ్యవస్థలో మార్పు రావాలంటే ప్రజల ఆలోచనల్లో మార్పు రావాలని, జరిగేదంతా మన మంచికే అని ఊరుకోకుండా పాలకుల కుయుక్తులను ప్రశ్నించడం మొదలుపెట్టాలని ఆమె కోరుకుంటున్నారు.

- జ్యోతిర్మయి

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక , ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501,
గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి :
jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రంగవల్లి



13 చుక్కలు 5 వరుసలు, 5 వచ్చే వరకు (సరి చుక్క)



సి. తన్మయి,
ఎఎస్ రావు నగర్,
హైద్రాబాద్.

15 చుక్కలు 8 వచ్చేవరకు (మధ్య చుక్క)



శ్రీహిత,
వనుమోతు సెంటర్,
నెల్లూరు.



ఆర్థిక వ్యవస్థకు పిఎస్‌యుల దన్ను

- ఖజానాకు రూ.5 లక్షల కోట్లు
- అదరగొట్టిన లాభాలు
- డివిడెండ్‌లోనూ 58% వృద్ధి
- 2021-22లో మెరుగైన ప్రగతి..
- ప్రభుత్వ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ రంగ సంస్థలు దన్నుగా నిలిచాయి. లాభాలను ఆర్జించడంతో పాటుగా డివిడెండ్ చెల్లింపులు, కార్పొరేట్ సామాజిక బాధ్యతలో మెరుగైన ప్రగతని కనబర్చాయి. ఒఎన్‌జిసి, ఇండియన్ ఆయిల్, పవర్ గ్రిడ్, సెయిల్ కంపెనీలు అధిక లాభాలు సాధించి.. మెరుగైన ప్రగతిని కనబర్చిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం 2021-22లో ఈ నాలుగు కంపెనీల నిర్వహణ నికర లాభాలు ఏకంగా రూ.2.49 లక్షల కోట్లుగా నమోదయ్యాయని ప్రభుత్వ సర్వేలో వెల్లడయ్యింది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.1.65 లక్షల కోట్ల లాభాలు నమోదయ్యాయి. కాగా.. 2021-22లో నష్టాల్లోని పలు సిపిఎస్ఇల నికర నష్టాలు రూ.15వేల కోట్లకు తగ్గాయి. 2020-21లో వీటి నష్టం రూ.23 వేల కోట్లుగా నమోదయ్యింది. దీంతో పోల్చితే గడిచిన ఆర్థిక సంవత్సరంలో నష్టాలు 37.82 శాతం తగ్గాయి. ముఖ్యంగా బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్, ఎయిర్ ఇండియా అసెట్ హోల్డింగ్, ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్, అలయన్స్ ఎయిర్ ఏవియేషన్ సంస్థలు నష్టాలు నమోదు చేశాయి.

2021-22లో మొత్తం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు స్థూల రెవెన్యూ రూ.31.95 లక్షల కోట్లకు ఎగిసింది. ఇంతక్రితం ఏడాది 2020-21లో రెవెన్యూ రూ.24.08 లక్షల కోట్లుగా ఉంది. ఇదే ఏడాది రూ.73వేల కోట్ల డివిడెండ్‌ను ప్రకటించగా.. గడిచిన 2021-22లో 57.58 శాతం పెరుగుదలతో రూ.1.15 లక్షల కోట్ల డివిడెండ్‌ను అందించాయి. మొత్తం రెవెన్యూలో పెట్రోలియం, ట్రేడింగ్, మార్కెటింగ్, విద్యుత్ ఉత్పత్తి కంపెనీల వాటా 69.08 శాతంగా ఉండటం విశేషం. అన్ని సిపిఎస్ఇల నికర లాభాలు 2020-21లో రూ.1.89 లక్షల కోట్లుగా ఉండగా.. గడిచిన 2021-22లో రూ.2.64 లక్షల కోట్లకు పెరిగాయి. పెట్రోలియం (రిఫైనరీ మరియు మార్కెటింగ్), ముడి చమురు, రవాణా, లాజిస్టిక్స్ విభాగాల మెరుగైన పనితీరు కారణంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పెరగడానికి దోహదం చేశాయని ఈ సర్వే పేర్కొంది. తయారీ, ప్రాసెసింగ్, ఉత్పాదక, మైనింగ్ రంగాలు మెరుగైన ప్రగతిని కనబర్చాయి.

2021-22లో సిపిఎస్‌యులు అన్నీ కలిసి ఎక్సైజ్ డ్యూటీ, కస్టమ్ డ్యూటీ, కార్పొరేట్ పన్ను, కేంద్ర ప్రభుత్వ రుణాలపై వడ్డీ, డివిడెండ్‌లు, ఇతర సుంకాలు, పన్నుల రూపంలో మొత్తంగా రూ.5.07 లక్షల కోట్లు అందించాయి. ఈ రూపంలో 2020-21లో రూ.4.97 లక్షల కోట్ల మొత్తాన్ని కేంద్రానికి ముట్టజెప్పాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ ఒమన్ రిఫైనరీస్ లిమిటెడ్, చెన్నయ్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కేంద్ర ఖజానాకు అత్యధికంగా పన్నులు అందిస్తున్న మొదటి ఐదు సంస్థల్లో టాప్‌లో ఉన్నాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లోనూ పిఎస్‌యులు ముందంజలో ఉన్నాయి. 2021-22లో పిఎస్‌యులు సిఎస్ఆర్ కింద రూ.4,600 కోట్లు వ్యయం చేశాయి. ఇంతక్రితం ఏడాది 2020-21లో రూ.4,483 కోట్లు వితరణ చేశాయి. సిఎస్ఆర్ సేవల్లో ఒఎన్‌జిసి, ఎన్‌టిపిసి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎన్ఎండిసి, పవర్ గ్రిడ్‌లు టాప్‌లో ఉన్నాయి.

బౌలర్లే గెలిపించారు

శివమ్ మావి అరంగేట్రం అదుర్స్
బ్యాటింగ్‌లో రాణించిన హుడా
లంకపై రెండు పరుగుల తేడాతో భారత్ గెలుపు



ముంబయి: చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా శ్రీలంకతో జరిగిన తొలి టి20లో టీమిండియా 2 పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. చివరి బంతికి విజయానికి 4పరుగులు చేయాల్సిన లంక జట్టు ఒక్క పరుగు మాత్రమే చేయడంతో భారత్ గెలిచింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టపోయి 162పరుగులు చేసింది. ఛేదనలో లంక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 160పరుగులకు ఆలౌటైంది. భారతజట్టు గెలుపులో అరంగేట్ర యువ పేసర్ శివమ్ మావి(4/24) అద్భుత స్పెల్‌తో ఆకట్టుకున్నాడు. తొలుత ఇషాన్ కిషన్, చివర్లో దీపక్ హుడా ఆకాశమే హద్దుగా చెలరేగారు. అక్షర్, హార్దిక్ కూడా సహకరించడంతో ఇండియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్లు నష్టపోయి 162పరుగుల గౌరవప్రద స్కోర్‌ను నమోదు చేసింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. ఇషాన్‌కి తోడు మరో ఓపెనర్ శుభ్‌మన్(7) నిరాశపరిచాడు. సూర్యకుమార్(7), సంజు(5) కూడా నిరాశపరచడంతో టీమిండియా 46పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో హార్దిక్(29) జత కలవడంతో ఇషాన్(37) చెలరేగి ఆడాడు. వీరిద్దరూ ఔటయ్యే సమయానికి భారతజట్టు 14.1ఓవర్లలో 94పరుగులు చేసి 5 వికెట్లు కోల్పోయింది. చివర్లో దీపక్ హుడా(41నాటౌట్; 23బంతుల్లో ఫోర్, 4సిక్సర్లు), అక్షర్(31నాటౌట్; 20బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్) చెలరేగి ఆడారు. వీరిద్దరూ కలిసి 6వ వికెట్‌కు 35బంతుల్లో 66పరుగులు జతచేశారు. దీంతో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 162పరుగుల గౌరవప్రద స్కోర్ చేయగల్గింది. ఛేదనలో లంక జట్టు కెప్టెన్ శనక(45; 27బంతుల్లో 3ఫోర్లు, 3 సిక్సర్లు) కరుణరత్నే(23నాటౌట్; 16బంతుల్లో 2సిక్సర్లు) రాణించారు. రెండో టి20 పూణే వేదికగా గురువారం జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దీపక్ హుడాకి లభించింది.

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి)ధనుంజయ (బి)హసరంగ 37, శుభ్‌మన్ (ఎల్‌బి)తీక్షణ 7, సూర్యకుమార్ (సి)రాజపక్సె (బి)కరుణరత్నే 7, సంజు శాంసన్ (సి)మధుశనక (బి)ధనుంజయ 5, హార్దిక్ (సి)కుశాల్ మెండీస్ (బి)మధుశనక 29, దీపక్ హుడా (నాటౌట్) 41, అక్షర్ పటేల్ (నాటౌట్) 31, అదనం 5. (20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి) 162పరుగులు. **బౌలింగ్:** రజిత 4-0-47-0, మధుశనక 4-0-35-1, తీక్షణ 4-0-29-1, కరుణరత్నే 3-0-22-1, ధనుంజయ 1-0-6-1, హసరంగ 4-0-22-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిస్సంక (బి)శివమ్ మావి 1, కుశాల్ మెండీస్ (సి)సంజు (బి)హర్షల్ 28, ధనుంజయ (సి)సంజు (బి)శివమ్ మావి 8, అసలంక (సి)ఇషాన్ (బి)ఉమ్రన్ 12, రాజపక్సె (సి)హార్దిక్ (బి)హర్షల్ 10, దుశన్ శనక (సి)చాహల్ (బి)ఉమ్రన్ 45, హసరంగ (సి)హార్దిక్ (బి)శివమ్ మావి 21, కరుణరత్నే (నాటౌట్) 23, తీక్షణ (సి)సూర్యకుమార్ (బి)శివమ్ మావి 1, రజిత (రనౌట్) దీపక్ హుడా/అక్షర్ 5, మధుశనక (రనౌట్) దీపక్ హుడా/ఇషాన్ 0, అదనం 6. (20 ఓవర్లలో ఆలౌట్) 160పరుగులు. **బౌలింగ్:** హార్దిక్ 3-0-12-0, శివమ్ మావి 4-0-22-4, ఉమ్రన్ 4-0-27-2, చాహల్ 2-0-26-0, హర్షల్ 4-0-41-2, అక్షర్ 3-0-31-0

ముందస్తు ఎన్నికలు వస్తే ఇంటికే

- మళ్లీ ' ఆనం' వివాదస్పద వ్యాఖ్యలు
- వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా తొలగింపు
- ' నేదురుమల్లి' నియామకం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ముందస్తు ఎన్నికలు వస్తే ప్రస్తుత ఎమ్మెల్యేలందరూ ఇంటికి వెళతారని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో మంగళవారం జరిగిన వలంటీర్లు, గ్రామ సారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తు ఎన్నికలు వస్తాయని ప్రచారం సాగుతోందని.. ముందస్తు వస్తే అందరు ఎమ్మెల్యేలు ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. నియోజకవర్గాల్లో కనీసం రోడ్లు వేయలేని పరిస్థితులున్నాయని, కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని తెలిపారు. సచివాలయాల నిర్మాణాలకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. కాగా ఈ వ్యాఖ్యలపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ స్పందించారు. వర్షాల కారణంగా రోడ్లు వేయలేకపోయామని, ప్రస్తుతం రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. 2024లోనే ఎన్నికలు జరుగుతాయని, ఎన్నికలెప్పుడూ జరిగిన జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ముందస్తు ఎన్నికలు జరిగితే అందరూ ఇంటికి పోతారని ఆనం కలలు కంటున్నారని, అది జరగదని తెలిపారు. ఇటీవల బహిరంగ వేదికలపై రాష్ట్ర ప్రభుత్వంపై ఆనం చేస్తున్న విమర్శల నేపథ్యంలో ఆయనపై వైసిపి అధిష్టానం చర్యలు తీసుకుంది. వైసిపి వెంకటగిరి ఇన్‌చార్జ్‌గా ఆయనను తొలగించింది. ఆయన స్థానంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని నియమిస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. దీంతో ఒక్కసారిగా వైసిపిలో కలకలం రేగింది. వెంకటగిరిలో రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయోనని ఆ పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబుదే బాధ్యత

- అంబటి, విడదల, మేరుగ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో జరిగిన తొక్కిసలాటకు టిడిపి అధినేత చంద్రబాబే బాధ్యుడని రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, విడదల రజనీ ఆరోపించారు. ఈ ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున రూ.2 లక్షలు, గాయపడిన 19 మందికి రూ.50 వేల చొప్పున చెక్కులను మంత్రులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తొక్కిసలాట ఘటనలో చంద్రబాబు పాత్ర లేదని నిరూపిస్తే తాను మంత్రి పదవికి, శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని మేరుగ నాగార్జున సవాల్ చేశారు. రాష్ట్రంలో టిడిపి సభల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మంత్రి విడదల రజనీ మాట్లాడుతూ 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు మూడు ఘటనల్లో 40 మంది ప్రాణాలను బలిగొన్నారని ఆరోపించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.


ఆంధ్ర 135 ఆలౌట్

హైదరాబాద్‌తో రంజీట్రోఫీ మ్యాచ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని చింతలవలస పివిజి రాజు క్రికెట్ మైదానంలో ఆంధ్ర, హైదరాబాద్ జట్ల మధ్య రంజీ మ్యాచ్ ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచి హైదరాబాద్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 135 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అభిషేక్ రెడ్డి ఒక్కడే 81 పరుగులు చేసి రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ 5, కార్తికేయ 3 వికెట్లు తీసి ఆంధ్ర జట్టును పరుగులు చేయకుండా కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు తొలిరోజు అట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. అగర్వాల్(35) టాప్ స్కోరర్. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్, సుదర్శన, నితీష్ కుమార్ చెరో వికెట్ దక్కాయి.


ఉనాద్కట్ హ్యాట్రిక్..



సౌరాష్ట్ర కెప్టెన్ జయదేవ్ ఉనాద్కట్ రంజీ ట్రోఫీలో హ్యాట్రిక్ నమోదు చేశాడు. ఎలైట్ గ్రూప్-బిలో భాగంగా ఢిల్లీపై తొలి ఓవర్ మూడు, నాలుగు, ఐదో బంతులకు ధ్రువ్ షోరే, వైభవ్ రావల్, యశ్ ధుల్‌లను పెవిలియన్‌కు పంపాడు. మొత్తమ్మీద 8వికెట్లు తీయడంతో ఢిల్లీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 133పరుగులకే కుప్పకూలింది. ఉనాద్కట్ రెండో ఓవర్‌లోనూ ఢిల్లీ బ్యాటర్లు లలిత్ యాదవ్(0), లక్ష్య్ తరేజా(1)లను ఔట్ చేశాడు. ఉనాద్కట్‌కు తోడు, చిరాగ్ జానీ ఒక వికెట్, ప్రేరక్ మన్కడ్ ఒక వికెట్ తీశారు. దీంతో లంచ్ బ్రేక్ సమయానికి ఢిల్లీ 8 వికెట్లు నష్టపోయి 108 పరుగులు చేసింది. లంచ్ బ్రేక్ అనంతరం ఉనాద్కట్ మరో రెండు వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 184పరుగులు చేసింది. ఓపెనర్ హర్విక్ దేశాయ్(104నాటౌట్) సెంచరీతో కదం తొక్కాడు.

మనిక కెరీర్ బెస్ట్

టిటి తాజా ర్యాంకింగ్స్‌లో 35వ స్థానం



న్యూఢిల్లీ: భారత మహిళా టేబుల్ టెన్నిస్(టిటి) క్రీడాకారిణి మనిక భత్రా కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను సాధించింది. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ (ఐటిటిఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో మనిక 35వ ర్యాంక్‌లో నిలిచింది. 27ఏళ్ల మనిక గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించడంతో ఆమె ర్యాంక్ మెరుగైంది. బ్యాంకాక్ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో మనిక.. 5వ ర్యాంకర్ హినా హయటా(జపాన్)ను, 7వ ర్యాంకర్ ఛెన్ ఝింగ్‌టన్‌ను ఓడించింది. దీంతో మనిక ఖాతాలో 175పాయింట్లు జమ అయ్యాయి. సెమీస్‌లోనూ 2సార్లు మహిళల ఛాంపియన్ హంగేరీ, స్లొవేనియాలపై గెలిచి పతకం సాధించింది. 2022 బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో పతకం సాధించడంలో విఫలమైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో జి. సాథియాన్(39వ ర్యాంక్), వెటరన్ శరత్ కమల్ 3స్థానాలు కోల్పోయి 47వ ర్యాంక్‌లో నిలిచారు.

న్యూజిలాండ్ 449ఆలౌట్

కరాచీ: పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండోటెస్ట్‌లో న్యూజిలాండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 449పరుగులు చేసింది. ఓవర్ నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 309పరుగులతో మంగళవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన న్యూజిలాండ్‌ను బ్లండెల్(51), హెన్రీ(68) అర్ధసెంచరీలతో ఆదుకున్నాడు. అబ్రార్‌కు నాలుగు, అఘా సల్మాన్, నసీమ్ షాకు మూడేసి వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 154పరుగులు చేసింది. ఓపెనర్ షఫీక్(19) నిరాశపరిచినా... ఇమామ్-ఉల్-హక్(74నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68